

దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



SINCE: 1984
చైతన్య కాలేజ్
Cell: 93908 22625
ONE SITTING (For Discontinued)
B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS



డైరెక్టర్: బి.వి. త్రినాథ్ M.A, M.Ed, M.Phil, L.L.B



| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 147 | ది.12-9-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 148 | Date : 12-9-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |


# పెన్షన్లు-సంక్షేమం కోసం చిన్న కుటుంబాలుగా విడిపోవద్దు

- పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేలా సంక్షేమం... ఇదే కూటమి ప్రభుత్వ విధానం
- కొత్త పెన్షన్లకు ముందే ఫ్యామిలీ యూనిట్ మ్యాపింగ్ పూర్తవ్వాలి
- అసంపూర్తిగా ఉన్న కాపు భవనాలను పూర్తి చేయండి
- యానాటి కొండ సామాజికవర్గానికి ఎస్టీలకు కలిగే ప్రయోజనాలు
- సూపర్ సిక్స్ పథకాల అమలుపై కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** సంక్షేమ పథకాల ప్రయోజనాల కోసం చిన్న కుటుంబాలుగా విడగొట్టకుండా... భవిష్యత్తులో అన్ని పథకాలను ఫ్యామిలీ యూనిట్‌గానే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొత్త పెన్షన్ల జారీకి ముందే కుటుంబాల మ్యాపింగ్ చేపట్టాలని, ప్రస్తుతం ఉన్న లబ్ధిదారులను యథాతథంగా కొనసాగిస్తూనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రేషన్, పెన్షన్ల కోసం కుటుంబాలు చిన్న కుటుంబాలుగా మారిపోవడం సరికాదన్నారు. పెద్ద కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడం, ఆ కుటుంబానికి ఎక్కువ ప్రయోజనాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇదే ప్రభుత్వ విధానమని.. దానికి అనుగుణంగానే పాలసీలు, కార్యాచరణ ఉండాలని సీఎం చంద్రబాబు వెల్లడించారు. 8వ కలెక్టర్ల సమావేశం రెండో రోజున శుక్రవారం సూపర్ -6 పథకాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

**సంక్షేమం నుంచి కుటుంబ సాధికారత విధానంతో ముందుకు..** కుటుంబంలో ఎంత మంది ఉంటే... అంత మందికి ఐదు కిలోల చొప్పున రేషన్ బియ్యం అందించేలా చూడాలని సీఎం సూచించారు. సంక్షేమ పథకాల అమలులో కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని సమగ్ర ప్రయోజనాలు అందించే విధానాన్ని రూపొందించాలన్నారు. వివిధ పథకాల్లో ఉన్న లోటుపాట్లను సరిచేసి అత్యుత్తమ విధానాలను రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల కోసం ఇప్పటివరకు రూ.1.50 లక్షల కోట్ల మేర ఖర్చు చేశామని చంద్రబాబు తెలిపారు. ఇందులో ఒక్క పెన్షన్లకే రూ.75 వేల కోట్లు వ్యయం చేసినట్లు వెల్లడించారు. ఆర్థిక అసమానతలను తగ్గించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా సంక్షేమ విధానాలు ఉండాలని అన్నారు. సంక్షేమం నుంచి కుటుంబాలను సాధికారత దిశగా తీసుకెళ్లే 'వెల్ఫేర్ టు ఎంపవరింగ్ ఫ్యామిలీస్' విధానంతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. సెర్ప్, మెప్మా ద్వారా 'వన్ ఫ్యామిలీ.. వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలని చంద్రబాబు సూచించారు. ఐదు లక్షల మంది మహిళలను ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టామని తెలిపారు. వివిధ సామాజిక వర్గాలను సాధికారత దిశగా తీసుకెళ్లాలి... అందర్నీ అభివృద్ధి చేయాలన్నారు. హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్యమైన ఉత్పత్తులతో పాటు మెరుగైన విద్య అందించాలని స్పష్టం చేశారు. పీ4 కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు.

# శతాబ్దం కాలం నాటి భూ సమస్యలూ పరిష్కరిస్తున్నాం

## 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

- సుదీర్ఘంగా వివాదంలోని రూ.5 వేల కోట్ల విలువైన 31 వేల ఎకరాలకు విముక్తి
- ఏపీకి వచ్చే పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా నైపుణ్య శిక్షణ
- పీఎం సూర్యఘర్ పథకాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేయండి



**అమరావతి, సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని భూముల వివాదాలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల చాలా భూములు వివాదాల్లోకి వెళ్లాయని... ఈ వివాదాలను పరిష్కరించడంతోపాటు... శతాబ్ద కాలం నుంచి వివాదంలో ఉన్న భూ సమస్యలను సైతం పరిష్కరిస్తున్నామని చెప్పారు. దీంట్లో భాగంగా ఇప్పటి వరకు 232 సుదీర్ఘ కాలం పెండింగులో ఉన్న భూ వివాదాలను క్లియర్ చేశామని.. వీటి విలువ సుమారు రూ. 5 వేల కోట్లు ఉంటాయని.. మొత్తంగా సుదీర్ఘంగా వివాదంలో ఉన్న 31 వేల ఎకరాలకు విముక్తి కల్పించామని సీఎం చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జరిగిన 8వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండో రోజున రెవెన్యూ, విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, పురపాలక, విద్యుత్ శాఖలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...'వివిధ జిల్లాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోండి. అంబాజీపేటలో గ్రాండ్ రెంట్ భూముల అంశం 120 ఏళ్ల కాలం నాటి సమస్య. అలాంటి సమస్యను పరిష్కరించగలిగాం. ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవహారాల్లో ఎక్కడా అవినీతి లేకుండా భూ సమస్యల్ని పరిష్కరించాలి. మంత్రులు, అధికారులు కూడా ఈ సమస్యల్ని పరిష్కరించిన విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. రీసర్వే ప్రక్రియ పూర్తైన భూములకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రత కల్పించాలి. నవంబరు 1 తేదీ నుంచి రియల్ టైమ్ లో ఇంటిగ్రేషన్ చేయండి. రెవెన్యూ సమస్యల పరిష్కారం... ప్రభుత్వం తీసుకుంటున్న పాలసీల గురించి ప్రజలకు వివరించాలి.'అని చెప్పారు.

**నిరంతరాయంగా నైపుణ్యాభివృద్ధి..** "రాష్ట్రంలో పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో యువత ఉంటారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించటం నిరంతర ప్రక్రియ. పీఎం సేతు కార్యక్రమాన్ని విశాఖతో పాటు ఇతర ప్రాంతాలకూ విస్తరించి య-ువతకు మరిన్ని నైపుణ్యాలు కల్పించాలి. పరిశ్రమలు నుంచి సీఎస్ఆర్ నిధులతోనూ ఈ నైపుణ్యాలను కల్పించే అంశాన్ని పరిశీలించండి. ఏపీకి వచ్చే పరిశ్రమల్లో నైపుణ్యం ఉన్న మన యువతే ఉద్యోగాలు పొందేలా కార్యాచరణ చేపట్టాలి. నియోజకవర్గాల వారీగా జాబ్ ఫెయిర్లు నిర్వహించాలి. ఇప్పటి వరకూ 4.98 లక్షల మంది యువత నైపుణ్యం పోర్టల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నైపుణ్య కల్పనపై ప్రజల్లో కూడా విస్తృత అవగాహన కల్పించాలి.

# ఇంటింటికీ టీడీపీ-2026 గ్రాండ్ సక్సెస్..

**నేటితో ముగిసిన ఇంటింటికి తెలుగుదేశం 2026 కార్యక్రమం**

- రాష్ట్రంలోని 81.11 శాతం ఇళ్లను నేరుగా చేరుకున్న టీడీపీ శ్రేణులు
- మైటీడీపీ యాప్‌తో ప్రతి సందర్శనను టెక్నాలజీతో ట్రాక్ చేసిన నారా లోకేష్
- కార్యకర్తలకు అభినందనలు తెలియజేసిన రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

**అమరావతి, సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకు చేర్చాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పర్యవేక్షనలో చేపట్టిన ఇంటింటికి తెలుగుదేశం - 2026 బృహత్తర కార్యక్రమం నేటితో ముగిసింది. తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం--2026' రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధీ, సంక్షేమం కార్యక్రమం 47 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగినంది. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు 1,10,24,319 ఇళ్లను నేరుగా సందర్శించారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 1,35,91,105 ఇళ్లలో 81.11 శాతం ఇళ్లను పార్టీ శ్రేణులు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు, పరిపాలనా సంస్కరణలను ప్రతి ఇంటికి నేరుగా తీసుకెళ్లడంతో పాటు, ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఇది కేవలం ఒక పార్టీ కార్యక్రమం కాదు.. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమైన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కష్టం, క్రమశిక్షణ, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ లెవల్ కార్యకర్తలు సహా పార్టీలో క్రియాశీలంగా పనిచేస్తున్న అన్ని స్థాయిల శ్రేణులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**ఒక్కరోజులోనే 19,405 బూత్‌లు..** 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమంలో కార్యకర్తల భాగస్వామ్యం ఏ స్థాయి లో ఉందో గణాంకాలే చెబుతున్నాయి. కార్యక్రమం ప్రారంభమైన 40 రోజుల్లోనే కోటి ఇళ్ల సందర్శన మైలురాయిని అధిగమించింది. ఒక్కరోజులో 19,405 బూత్‌లలో కార్యక్రమం నిర్వహణ. ఒక్కరోజులో 28,397 మంది కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పాల్గొనడం, ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో బూత్‌లు, కార్యకర్తలు పనిచేయడం రికార్డు. కార్యకర్తల అంకితభావానికి నిదర్శనంగా ఆగస్టు 8న ఒక్కరోజే 3,51,229 ఇళ్లను సందర్శించారు.

# గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి

- గుంటుపల్లిలో రూ.45 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన
- మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామంలో మొత్తం రూ.45 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. గుంటుపల్లి గ్రామంలోని రామకృష్ణానగర్‌లో వివిధ ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.25 లక్షలు జెడ్పీ 23% జీఎల్ నిధుల ద్వారా, అలాగే అంబేద్కర్‌నగర్‌లో వివిధ ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.20 లక్షలు జెడ్పీ 15% ఎస్సీ నిధుల ద్వారా కేటాయించినట్లు తెలిపారు. ఈ రెండు పనులకు కలిపి మొత్తం అంచనా విలువ రూ.45 లక్షలు అని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తోందన్నారు. గుంటుపల్లి గ్రామంలో డ్రెయిన్ల నిర్మాణంతో ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ స్పష్టం చేశారుఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) జంపాల సీతారామయ్య,మండల టిడిపి అధ్యక్షుడు పెదర్ల రవి,కూటమి నాయకులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సమావేశంలో ఎన్.టి.ఆర్.జిల్లా కలెక్టర్, విజయవాడ సి.పి.



**విజయవాడ, సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** అమరావతి అని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు రెండో రోజు శాంతిభద్రతలపై జరిగిన సమీక్షకు హాజరైన ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు పాల్గొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, డ్రగ్స్ నియంత్రణ, మహిళల భద్రత, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల దర్యాప్తు, ఫోరెన్సిక్ సేవలు, పోలీసుల స్పందన వేగం, కన్విక్షన్ రేట్ పెంపు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు.

# పాలకవర్గానికి ఆత్మీయ వీడ్కోలు

- తన సహచర ఎంపీటీసీ సభ్యులను సత్కరించిన ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** ఇబ్రహీంపట్నం పరిషత్ పాలకమండలి పదవీకాలం త్వరలో ముగియనుంది. 5 సంవత్సరాలు విజయవంతంగా పరిపాలన సాగించి, తనతో పాటు నడిచిన ఎంపీటీసీ సభ్యులకు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న దుర్గాప్రసాద్. శాలువాతో సత్కరించి, తమ పదవీ కాలానికి గుర్తుగా మెమెంటో అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనతోపాటు ఐదు సంవత్సరాలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన సహచర సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఇదేవిధంగా ప్రజా సేవ చేస్తూ భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శకుంతల, అధికారులు పాల్గొన్నారు.

# పశ్చిమ నియోజకవర్గంలో 28 డివిజన్లలో కూటమి విజయం తథ్యం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందేలా కూటమి పార్టీ నాయకులు కృషి చేయాలి
- ప్రతి డివిజన్‌లో సమావేశాలు నిర్వహించి అభ్యర్థుల పేర్లు రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పంపిస్తాం
- పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న



**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం మల్లికార్జునపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్, ఇంచార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న మాట్లాడుతూ రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలోని 28డివిజన్లలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ, "పశ్చిమ నియోజకవర్గంలోని 28 డివిజన్లలో కూటమి విజయమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. 16 వ తేదీన నుండి 21 వ తేదీ వరకు ప్రతి రోజు 4 డివిజన్‌లో పార్టీ మరియు క్యాడర్ సమావేశాలు నిర్వహించి సమర్థులైన అభ్యర్థుల పేర్లను రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పంపిస్తాం. హైకమాండ్ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలి. రానున్న కార్పొరేషన్ ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు సమష్టిగా సిద్ధమై, పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కూటమి జెండా ఎగురవేయాలని బుద్ధా వెంకన్న పిలుపునిచ్చారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అర్హులైన ఒక్క వ్యక్తి కూడా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోకుండా ఉన్నవారిని బూత్ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమం లో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర్, గుర్రంకొండ, ఉమ్మడి చంటి, క్లస్టర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


## దస్తావేజు పోయినది

కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, పోరంకి రూరల్, విష్ణుపురం కాలనీ, వి.ఆర్.ఆర్.ప్రైడ్, 4వ ఫ్లోర్, ఫ్లాట్ నెం.406 కాపురస్తులు వంకాయలపాటి గోపాలకృష్ణయ్య గారి కుమారుడు వంకాయలపాటి రామారావు అనే నా పేరిట ది.08-01-2018వ తేదీన కంచికచర్ల సబ్‌రిజిస్ట్రారు రిజిస్ట్రారు కార్యాలయంలో 1వ పుస్తకం, నెం.147/2018రుగా రిజిస్ట్రీ కాబడిన ఒరిజినల్ దఖలు దస్తావేజుతో పాటు మరికొన్ని కాగితములు కలిగిన కవర్‌ను ది.15-06-2026న పటమట ఏరియా నుండి ఇల్లు మారే సందర్భంలో ఎక్కడో జారిపడిపోయినవి. వెంటనే చుట్టుప్రక్కల ఎక్కడ వెదకినను ఒరిజినల్ ఇంటి కాగితములు కనపడలేదు. కావున ఎవరికైనా దస్తావేజు కనపడిన యెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషికం అందజేయుబడును. వాటిని ఎవ్వరైనా దుర్వినియోగపరచినచో చట్టప్రకారం చర్యలు తీసుకొందునని, సదరు దస్తావేజును ఎవరికినీ తాకట్టు పెట్టుటగానీ, అన్యాక్రాంతములు చేయుటగానీ జరిగి యుండలేదని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

సెల్ నెం.9160686098




# నేడే జాతీయ లోక్ అదాలత్..



**నూజివీడు,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** సెప్టెంబర్ 12న నూజివీడు గౌరవ కోర్టుల ఆవరణలో "జాతీయ లోక్ అదాలత్"జరుగుతుంది. కేసుల పరిష్కారానికి సుముఖంగా ఉన్న కక్షిదారులు తమ న్యాయ వాది ద్వారా ఇరు పార్టీలు హాజరు కావడం ద్వారా రాజీ కుదుర్చుకొని తద్వారా ఖర్చు, సమయం, ఆదా చేసుకోవచ్చు అని నూజివీడు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు గౌరవ 15 వ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి డా. డి సత్యవతి గారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో రాజీకి వీలున్న అన్ని క్రిమినల్ కేసులు,బ్యాంకు రికవరీ కేసులు,ఎక్సైజ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ యాక్సిడెంట్ కేసులు మొదలగునవి పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు. ఇతర వివరములకు సందేహములకు నూజివీడు కోర్టు ప్రాంగణంలోని మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవలసిందిగా వారు తెలిపారు.

# కరువు తో అల్లాడుతున్న రైతులను, కార్మికులను ఆదుకోండి

● తహశీల్దార్ కు వినతిపత్రం అందజేత.



**రాజాం, సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** తీవ్ర వర్షాభావ పరిస్థితులు, కరువుతో అల్లాడుతున్న రైతులను, కౌలు రైతులను, వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏఐకెఎస్) స్థానిక తహశీల్దార్ రాజశేఖర్ కు శుక్రవారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం విజయనగరం జిల్లా కన్వీనర్ ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వర్షపాతం కంటే భారీ లోటు ఏర్పడటంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజాం మండలంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావం వల్ల పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. సాగు పనులు లేక వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారులు ఉపాధి కోల్పోయి ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, మూగజీవాలకు మేత, తాగునీరు కరువై రైతులు పశువులను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించిరాజాం మండలాన్ని కరువు ప్రాంతాలుగా ప్రకటించి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజాం మండలంలో వర్షాభావ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని, కరువు వల్ల పంట నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఎకరానికి రూ.50,000 తో పాటు పంటల బీమా పరిహారాన్ని వెంటనే చెల్లించాలని, రైతులు, కౌలు రైతుల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్లు చేశారు అదేవిధంగా మూగజీవాలకు ఉచితంగా పశుగ్రాసం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలను నివారించేందుకు ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టి, రోజువారీ వేతనం రూ.700 చెల్లించాలన్నారు. కరువు ప్రభావిత కుటుంబాలకు నెలకు రూ.10,000 కరువు పింఛనుతో పాటు రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు 16 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని నీలకంఠేశ్వరరావు కోరారు. ఆయనతోపాటు సిపిఎం మండల నాయకులు కనకరాజు, ఎచ్చర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జి.కొండూరు పి హెచ్ సి ఎదుట పారిశుధ్యం అధ్వానం

## పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



**జి.కొండూరుసెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా,జి.కొండూరు మండలం,కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ప్రజలకు ఆరోగ్యాన్ని ప్రసాదించాల్సిన వైద్యాలయం ముందే మురికికూపాలు, చెత్తాచెదారం పేరుకుపోవడంవల్ల రోగులు మరిన్ని కొత్త రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ఆసుపత్రి పరిసరాల్లో అపరిశుభ్రత వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు మరియు టైఫాయిడ్ వంటి వ్యాధులు వేగంగా వ్యాపి చెందుతాయి.బాలింతలు, పసిపిల్లలు మరియు గర్భిణీలు ఇమ్యూనిటీ (రోగనిరోధక శక్తి) తక్కువగా ఉండటం వల్ల ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశం ఉంది.ఆసుపత్రి లోపల బయట కూడా స్వచ్ఛత లోపించిందని ఆసుపత్రికి వచ్చే రోగులు ఆరోపిస్తున్నారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు (DMHO) మరియు స్థానిక ప్రజాప్రతినిధులు ఈ సమస్యను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని ఆసుపత్రికి వచ్చిపోయే రోగులు కోరుతున్నారు.

# పైండా చలమయ్య సత్రం 110వ వార్షికోత్సవం సందర్భంగా దుప్పట్లు పంపిణీ





**కాకినాడ,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** కాకినాడ నగరంలోని దేవాలయం వీధిలో ఉన్న పైండా చలమయ్య సత్రం 110 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం దాత పైండా చలమయ్య విగ్రహానికి పూలమాలలు వేసి వారు కుటుంబీకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాత చలమయ్య విగ్రహానికి వారి సోదరుడు పైండా వెంకటేశ్వరరావు హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పైండా కుటుంబీకులు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పైండా వెంకటనారాయణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 110 ఏళ్ల క్రితం పేదలకు అన్నదానం అందించాలనే సంకల్పంతో ఈ సత్రాన్ని చలమయ్య ఏర్పాటు చేశారన్నారు. అప్పటినుంచి నేటి వరకు ఎటువంటి ఆటంకాలు లేకుండా విద్యార్థులకు, పేదలకు భోజన వసతులు సమకూర్చి దుప్పట్లతో పాటు వస్త్రాలను పంపిణీ చేస్తున్నట్లు నారాయణ చెప్పారు. దాత చలమయ్య చేసిన సేవలను నేటి మా పైడా కుటుంబీకులు కొనసాగిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సత్రం కార్యనిర్వాహణాధికారి ఎం. శ్రీదేవి, పైండా కుటుంబీకులు డాక్టర్ పైండా రామకృష్ణ, వెంకటేశ్వరరావు,పైండా శ్రీనివాస్,బాదం బాలకృష్ణ,బాదం చంద్రశేఖర్,బాదం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 'సైనైడ్ నేనే ఇచ్చా.. విచారణలో సాధిక్ వెల్లడి?

● 'రూ.25 కోట్ల ఆస్తి కోసం.. కొబ్బరి నీళ్లలో సైనైడ్ కలిపి ఇచ్చా..' జగదీశ్వరరెడ్డి హత్య కేసులో షాకింగ్ విషయాలు వెల్లడి



**కాకినాడ,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** పంచాయతీరాజ్ ఏఈ టి నూకరాజు అల్లుడు జగదీశ్వరరెడ్డిని హత్య చేసేందుకు ప్రయత్నించింది తానేనని నిందితుడు సాధికాఖాన్ పోలీసుల విచారణలో అంగీకరించాడు. ప్రస్తుతం రిమాండ్లో ఉన్న సాధిక్ను కోర్టు అనుమతితో కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు మూడు రోజులుగా విచారిస్తున్నారు. విచారణలో తొలి రెండు రోజులు తనకేమీ తెలియదని చెప్పిన సాధిక్.. పోలీసులు సాంకేతిక ఆధారాలను చూపడంతో పాటు సైనైడ్ విక్రయించిన వ్యక్తుల సాక్ష్యాల గురించి వెల్లడించడంతో చివరకు నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది. జగదీశ్వరరెడ్డిని హత్య చేయాలనే ఉద్దేశంతో విషపదార్థాన్ని ఒకసారి కొబ్బరి నీళ్లలో కలిపి ఇచ్చినట్లు సాధిక్ వెల్లడించినట్లు సమాచారం. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలోనూ మూడు, నాలుగు సార్లు విషపదార్థం ఇచ్చినట్లు పోలీసుల విచారణలో తెలిపినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన ఆరోగ్యం క్షీణించి మృతి చెందుతాడని భావించినట్లు తెలిపాడు. అయితే జగదీశ్వరరెడ్డి హైదరాబాద్లోని ఆసుపత్రిలో చికిత్స పొంది కొంత కోలుకుని ఇంటికి వచ్చిన తర్వాత కూడా సాధిక్ సైనైడ్ను పంపించినట్లు పోలీసులు గుర్తించారు. దాన్ని ఉపయోగించిన మరుసటి రోజే జగదీశ్వరరెడ్డి మృతి చెందినట్లు సాధిక్ విచారణలో వెల్లడించాడు.

**రూ.25 కోట్ల ఆస్తిపై కన్ను?..** జగదీశ్వరరెడ్డి భార్య సౌజన్యను వివాహం చేసుకుంటే ఆమె కుటుంబానికి చెందిన సుమారు రూ.25 కోట్ల విలువైన ఆస్తి తనకు దక్కుతుందని సాధిక్ భావించినట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే ఆమె తండ్రి వివాహానికి అంగీకరించలేదని, ఆస్తిని మనవడితో పాటు కుటుంబంలోని మరో వ్యక్తి పేరున రాస్తామని చెప్పడంతో వివాదం తలెత్తింది. ఈ విషయంలో తీవ్రంగా గొడవపడిన సాధిక్.. వారిని చంపేస్తానని బెదిరించాడు. అయితే వారు ఆత్మహత్య చేసుకుంటారని మాత్రం తాను ఊహించలేదని పోలీసుల ఎదుట వెల్లడించాడు. కేసు దర్యాప్తులో భాగంగా సాధిక్ ఉపయోగించినట్లు చెబుతున్న విషపదార్థం నమూనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సాంకేతిక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, స్వాధీనం చేసుకున్న నమూనాలను పరిశీలిస్తూ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్‌పై విమర్శలు సహించేది లేదు:చలమలశెట్టి రమేష్‌బాబు



**హనుమాన్‌జంక్షన్,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అవాకులు, చెవాకులు పేలితే సహించేది లేదని గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు హెచ్చరించారు. గురువారం సాయంత్రం హనుమాన్‌జంక్షన్‌లోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పవన్ కళ్యాణ్ 2009 నుంచి 2014 వరకు నిరంతరం ప్రశ్నించారని రమేష్‌బాబు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేసిన పవన్ కళ్యాణ్‌పై వంశీమోహన్ విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వాన్ని, ప్రజా సేవను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు అల్లాడశెట్టి నాగేశ్వరరావు, వడ్డి శివ నాగేశ్వరరావు, షేక్ అహ్మద్, చిమట రవివర్మ, పరుచూరి సుకూని, కొలసాని శివలీల, మద్దా జయరాణి, బండారు లక్ష్మీ ప్రసన్న, పవన్, వడ్డి అశోక్, వడ్డి తరుణ్, భార్గవ్, పూషదపు వీర వెంకయ్య, మహేష్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ నిలిపివేయాలి - యాదవ సంఘాల ఐక్య హెచ్చరిక



**నంద్యాల,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** నంద్యాల శ్రీనివాస్ సెంటర్, ఎన్టీఆర్ కాంప్లెక్స్ నందు ఈనెల 13 వ తేదీన శ్రీ కృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ బలిజసంఘం ఑ కాప్స్ రాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయటం సరైనది కాదని, అలా చేస్తే అడ్డుకుంటామని, నంద్యాల యాదవ సంఘం నాయకులు హెచ్చరించారు. శ్రీకృష్ణదేవరాయలు యాదవ వంశస్తులని వందల సంవత్సరాల నాటి చరిత్ర లు చెబుతున్నా, ఈ విషయాన్ని బలిజ వంశస్థులు తప్పుదోవ పట్టిస్తూ నంద్యాలలో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాన్ని ఒక కులానికి పరిమితం అని శిలాఫలకాలపై వారీ పేర్లు ముద్రించి విగ్రహ ఆవిష్కరణ చేయడం ఇది చట్టపరంగా విరుద్ధం. దీనిపై యాదవ సంఘం వారు నంద్యాల కలెక్టర్, డి ఆర్ ఓ ఆఫీస్, నంద్యాల మున్సిపల్ కమిషనర్, నంద్యాల ఏఎస్పీ లని కలిసి ఈ విగ్రహ ఆవిష్కరణ కు ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేయడము చట్ట పరంగా విరుద్ధమని వారికి విన్నవించడం జరిగినది. అలా కాకుండా విగ్రహావిష్కరణ జరపాలని చూస్తే ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల యాదవ సంఘ సభ్యులు తరలి వచ్చి విగ్రహావిష్కరణ ముట్టడిస్తామని తెలియ చేస్తు ధర్నాలకైనా వెనుకాడమని ప్రభుత్వ ఏర్పాటుతో కార్యక్రమం చేస్తే ఎలాంటి అభ్యంతరశీ లేదని స్థానిక ఎన్నికలు నాయకులు అధికారులు దుష్టిలో ఉంచుకుని యాదవ సమాజ మనోభావాలను దెబ్బతీసే విధంగా, చేయడం మంచి పద్ధతి కాదని వారు పేర్కొన్నారు. నంద్యాలలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కొందరు చేస్తున్న నంద్యాల బలిజ కాప్స్ సంగం వారు ప్రయత్నాలను విరమించు కోవాలని నంద్యాల యాదవ సంఘం వారు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమం లో అఖిల భారత యాదవ మహా సభ నంద్యాల జిల్లా అధ్యక్షులు పృథ్వి రాజ్ యాదవ్, నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెల్లా గోపాల్ యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బోధనం చెంద్రశేఖర్ యాదవ్, నాలి విజయ శేఖర్ యాదవ్, బండారు నాగేశ్వరావు యాదవ్,జయ లక్ష్మి యాదవ్, .శ్రీనివాసరావు యాదవ్, కాజా శ్రీనివాస్ యాదవ్ మహేష్ యాదవ్, మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్అండ్ గేమ్స్ క్విజ్ పోటీలు..



**ఏలూరు జిల్లా నూజివీడు,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా నూజివీడు మండలం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల అన్నవరంలో విద్యార్థినీ విద్యార్థులకు ఆటలు, మరియు క్రీడలు లో క్విజ్ పోటీలు నిర్వహించామని పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రవీంద్ర తెలిపారు. ప్రధమబహుమతి ఎనోష్, జయకృష్ణ, తనూజ్, అశ్వంత్, ఆనంద్, అఖిల్. ద్వితీయబహుమతి భరత్ కుమార్, అభినయ్, కిరణ్, హిమవంత్, ఆకాష్, రాజు. క్విజ్ నిర్వహణ జీవశాస్త్ర ఉపాధ్యాయులు దుర్గామల్లేశ్వరరావు నిర్వహించారు. బహుమతులను భోగిప్రసాద్ మాష్టారు స్పాన్సర్ చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు మరియు వ్యాయామఉపాధ్యాయులు రవీంద్ర పాల్గొన్నారు..

# సోమేశ్వరాలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం సింగన్నగూడెం గ్రామంలో వేంచేసి ఉన్న గంగా పార్వతి సమేత సోమేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి విజయవాడకు చెందిన దండమూడి లక్ష్మీ వెంకట శ్రీధర్ రూ.లక్ష విరాళం అందజేశారు. శుక్రవారం స్వామివారిని దర్శించుకున్న ఆయన ఆలయ పునర్నిర్మాణ పనులకు తన వంతు సహకారంగా రూ.1,00,000 చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణానికి భక్తులు, దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నాగేశ్వర శర్మ, గ్రామ ఉపసర్పంచ్ బెజవాడ వెంకటకృష్ణరావు, ఆలయ కమిటీ సభ్యులు మరీదు తిరుపతిరావు, పర్వతనేని రాజా, కొట్టే రాజా, మరీదు శ్రీను, పరికల వెంకయ్య, బత్తుల రామ్మోహన్, సమ్మెట సాంబశివరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నూజివీడు శ్రీ శారద ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా జాతీయ హిందీ దివస్ వేడుకలు






**ఏలూరు జిల్లా నూజివీడు,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా నూజివీడు శ్రీ శారద ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జాతీయ హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో హిందీ భాషపై ఆసక్తి, అభిమానం పెంపొందించేలా కార్యక్రమాలను ఎంతో ఉత్సాహభరితంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ ప్రసంగాలు, పద్యాలు, పాటలు, బేనర్ల ప్రదర్శన, భాషా ప్రతిభా ప్రదర్శనలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ హిందీ అధ్యాపకురాలు బి. బాలమణి మరియు ప్రైమరీ హిందీ టీచర్ నవుడు సత్యవాణి ముఖ్యపాత్ర పోషించారు. వారి సేవలను అభినందిస్తూ పాఠశాల చైర్మన్ కుప్పాల శంకర రావు గారు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కే. రాధిక మరియు చైర్మన్ కుప్పాల శంకర రావు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు జాతీయ హిందీ దివస్ శుభాకాంక్షలు తెలిపారు.చైర్మన్ కుప్పాల శంకర రావు మాట్లాడుతూ, "మన మాతృభాష మన సంస్కృతి, మన గుర్తింపుకు ప్రతీక. ఇంగ్లీష్ అంతర్జాతీయ భాషగా ప్రపంచంతో మనలను అనుసంధానిస్తే, హిందీ భారతదేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలను కలిపే ముఖ్యమైన భాషగా నిలుస్తోంది. అందువల్ల ప్రతి విద్యార్థి తన మాతృభాషతో పాటు హిందీ, ఇంగ్లీష్ భాషలను కూడా సమర్థవంతంగా నేర్చుకోవాలి" అని అన్నారు. హిందీని కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా, దేశ ప్రజలను అనుసంధానించే భాషగా భావించి, ప్రతి విద్యార్థి హిందీపై పట్టు సాధించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.విద్యార్థుల ఉత్సాహభరితమైన పాల్గొనడంతో జాతీయ హిందీ దివస్ వేడుకలు పాఠశాలలో స్ఫూర్తిదాయకంగా, ఆహ్లాదకరంగా మరియు వైభవంగా జరిగాయి.

# ఐదు రోజుల పని దినాలను తక్షణమే అమలు చేయాలి

## విధులను బహిష్కరించి స్ట్రైక్ చేసిన బ్యాంకుల సిబ్బంది



**నందిగామ,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** ఐదు రోజుల పని దినములను తక్షణమే అమలు చేయాలని కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అన్ని బ్యాంకుల సిబ్బంది విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రధాన డిమాండ్ అయిన ఐదు రోజుల పని దినములను తక్షణమే అమలు చేయనట్లయితే ఈ నెల 28, 29,30 తేదీల్లో వరుసగా మూడు రోజులు విధులను బహిష్కరణ జరుగుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్,టౌన్ బ్రాంచ్, చిల్లకల్లు,జగ్గయ్యపేట, జగ్గయ్యపేట కోదాడ రోడ్, కంచికచర్ల బజార్ సిబ్బంది పాల్గొన్నారు.

# దోమలపై దండయాత్ర.. గంబూసియా చేపలతో చెక్



**హనుమాన్‌జంక్షన్,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** పారిశుధ్య సమస్యలను నివారించడంతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తారకరామ కాలనీలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. కాలనీలో కచ్చా డ్రైన్లను తొలగించి, మురుగు కాల్వల్లో దోమల లార్వా వృద్ధిని అరికట్టేందుకు లార్వాను నాశనం చేసే గంబూసియా చేపలను వేశారు. దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ టౌన్ పార్టీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సురేష్, హెల్త్ సూపర్‌వైజర్ అప్పారావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించండి.. విజ్ఞానం పెంచుకోండి





**హనుమాన్‌జంక్షన్,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయాలంటే ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని జనవిజ్ఞాన వేదిక మండల గౌరవాధ్యక్షుడు వీరమాచినేని సత్యప్రసాద్ అన్నారు. తెలియని విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి ప్రతి విద్యార్థిలో ఉండాలని, అందుకు ప్రశ్నించడమే ప్రధాన మార్గమని తెలిపారు. బాపులపాడు మండల జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి మండల స్థాయి సంబరాల్లో భాగంగా మండల స్థాయి విజ్ఞాన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు జట్లుగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ధ్రువపత్రాలు, విజ్ఞానదాయక పుస్తకాలను అందజేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన జట్లు త్వరలో ఉయ్యూరులో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయని మండల అధ్యక్షుడు విడిస్ ప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు అందించి, సైన్స్ అంశాలను అర్థవంతంగా వివరించడం ద్వారా పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తున్నామని మండల ప్రధాన కార్యదర్శి దారపురెడ్డి భాస్కరరావు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో: అంపాపురం ఫ్రాంక్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రథమ, హనుమాన్‌జంక్షన్ సాయి గీతాంజలి హైస్కూల్ ద్వితీయ, రేమల్లి శ్రీ విజ్ఞాన్ హైస్కూల్ తృతీయ స్థానాలు సాధించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో: వీరవల్లి జడ్పీహెచ్ఎస్ ప్రథమ, వేలేరు జడ్పీహెచ్ఎస్ ద్వితీయ, బాపులపాడు జడ్పీహెచ్ఎస్ తృతీయ స్థానాలు సాధించాయి. గురజాడ అప్పారావు సూక్తి "సొంత లాభం కొంత మానుకుని పొరుగువారికి తోడ్పడవోయ్" స్ఫూర్తితో విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించాలని మండల సైన్స్ అధికారి డి.మల్లేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ సభ్యులు కళ్లేపల్లి నారాయణరావు, కుంపటి రవికుమార్, కృష్ణా జిల్లా ప్రైవేట్ స్కూల్స్ సెక్రటరీ సంఘోజు పూర్ణచంద్రరావు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్వీఎస్ చలపతిరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మైనవానిలంక ఎంపీపీ పాఠశాల లో వార్షిక తనిఖీలు



**కృత్తివెన్ను,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** పాఠశాల వార్షిక తనిఖీలో భాగంగా ఎంపీపీ ఎ స్ మైనవాలంక పాఠశాలలో శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు ఈ కార్యక్రమం లో ముఖ్య ఉద్దేశం పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించడానికి అదేవిధంగా ఉపాధ్యాయుల పనితీరును మెరుగుపరచడానికి పాఠశాలల్లో రికార్డులను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖధికారి ఎండీ అన్వర్ జూని సిహెచ్ కేశవరావు ఎస్ జి టి సీఆర్పీలు పీ దినేష్ సోమశేఖర్ వేణు పాల్గొనడం జరిగింది

# వీర వనిత "చాకలి ఐలమ్మ"కు ఘన నివాళులు



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ):**తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓల్డ్ హఫీజ్‌పేట్‌లోని శ్రీ లక్ష్మీ నరసింహా రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ భూస్వాములు, రజాకార్ల దౌర్జన్యాలకు ఎదురొడ్డి పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం బలంగా సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతున్నారు.ఆమె ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ ఐక్యత, ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చిన్న భిక్షపతి, మురళి, సత్యనారాయణ, రాజ్‌కుమార్, రాజు, అనిల్, శివ, జనార్దన్, నరసింహ, కన్నయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పేద మధ్యతరగతి వర్గాల కు ఆపన్న హస్తంగా సి.ఎం. సహాయ నిధి

**- సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ):**ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.14.91 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన 22 బాధిత కుటుంబాలకు పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అందజేశారు.అత్యవసర వైద్య చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ సాయం మంజూరైనట్లు తెలిపారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఆపన్నహస్తంగా నిలుస్తోందని గాంధీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు,జంగయ్య యాదవ్, చంద్రారెడ్డి, ఎండీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం

**- మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్, సెప్టెంబర్ 11 (వార్తాప్రభ):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కరీంనగర్ అర్బన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు.

# పర్యావరణాన్ని కాపాడటం కోసం వెలుగు ఫౌండేషన్ మట్టి విగ్రహాలు పంపిణీ.

**- కేడీసీసీ బ్యాంక్ సీఈవో ఎం. శ్యామ్ మనోహర్**



**మచిలీపట్నం: సెప్టెంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కేడీసీసీ బ్యాంక్ సీఈవో ఎం. శ్యామ్ మనోహర్ అన్నారు. వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను శుక్రవారం కేడీసీసీ బ్యాంక్ కార్యాలయంలో సీఈవో ఎం. శ్యామ్ మనోహర్, బ్యాంకు అధికారులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీఈవో ఎం. శ్యామ్ మనోహర్ మాట్లాడుతూ.. మట్టి వినాయకుడిని పూజించడం అంటే ప్రకృతిని పూజించడంతో సమానమని అన్నారు. మనకు జీవనాధారమైన ప్రకృతిని పరిరక్షించుకునే సందేశాన్ని వినాయక చవితి పండుగ అందిస్తుందని తెలిపారు. వినాయక చవితి పండుగ ప్రకృతితో ముడిపడి ఉందని, మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించినవారవుతారని పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వెలుగు ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమం అభినందనీయమని శ్యామ్ మనోహర్ ప్రశంసించారు.వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా మచిలీపట్నం నగరంలోని ప్రధాన కూడళ్లలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రత్యేకంగా మట్టి వినాయక విగ్రహాల్లో విత్తనాలను కూడా ఉంచుతున్నామని చెప్పారు. విగ్రహాన్ని నిమజ్జనం చేసిన అనంతరం ఆ మట్టిని ఇంటి ఆవరణలో లేదా పెరటిలో వినియోగిస్తే అందులోని విత్తనాల ద్వారా మొక్కలు మొలిచేలా ఈ విగ్రహాలను రూపొందిస్తున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంక్ సీఈవో ఎం. శ్యామ్ మనోహర్‌కు మట్టి వినాయక ప్రతిమను అందజేశారు.ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్లు పి.జె.ఎస్. ప్రభాకర్, పి. వరలక్ష్మి, ఎ. సి.హెచ్. రాంబాబు, వెలుగు ఫౌండేషన్ ఉపాధ్యక్షులు రేపల్లె వెంకట వీర వసంతరావు, ఫౌండేషన్ సభ్యులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు ప్రాథమిక వైద్యం అందజేస్తున్న ఆర్ఎంపి, పి.ఎం.పి లకు చట్టబద్ధ గుర్తింపు ఇవ్వాలి





**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 11: (వార్తాప్రభ):** గ్రామీణ, పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలకు చట్టబద్ధ గుర్తింపు కల్పించాలని టీఆర్పీఎస్ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు.పర్వత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా టి.ఆర్.పి.ఎస్ వైద్య సంఘాల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ జీవో 1273, 428, 429 ప్రకారం ప్రభుత్వానికి రుసుము చెల్లించి శిక్షణ పొందిన వారికి పరీక్ష నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు, గుర్తింపు కార్డులు అందించాలని కోరారు.శిక్షణ పొందని వారికి కూడా శిక్షణ ఇచ్చి పరీక్ష నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.నకిలీ వైద్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటించడంతో ఆర్ఎంపీ, పీఎంపీల్లో ఆందోళన నెలకొందని,వారికి భరోసా కల్పించేందుకే సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008లో అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం తెలంగాణకు చెందిన సుమారు 18 వేల మంది ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రథమ చికిత్స అందించే సేవకులుగా గుర్తింపు లభించిందన్నారు. అనంతరం సుమారు 40 వేల మంది ప్రభుత్వానికి రుసుము చెల్లించి ఏడాది పాటు వెయ్యి గంటల శిక్షణ పొందారని చెప్పారు.ఆర్ఎంపీ, పీఎంపీలకు వైద్య సేవల పరిధిని ప్రభుత్వం స్పష్టంగా నిర్దేశించాలని, ఆ పరిధిలోనే పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.గ్రామీణ వైద్యులపై దాడులు,తనిఖీలు, కేసుల పేరుతో వేధింపులు చేయవద్దని కోరారు.పల్స్‌పోలియో, ఎయిడ్స్ అవగాహన, కుటుంబ నియంత్రణ, బోదకాలు నివారణ తదితర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల్లో ఆర్ఎంపీ, పీఎంపీల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. త్వరలో యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసి బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు,పట్టణ దవాఖానాలు, పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల పనితీరుపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధ్యక్షుడు ఎండీ జఫ్ఫార్, మహిళా అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి జయశ్రీ, బుచ్చిబాబు, డాక్టర్ నందిని, డాక్టర్ ఖాన్‌సాబ్, డాక్టర్ చారి, డాక్టర్ శివరాజ్, డాక్టర్ అనిల్, డాక్టర్ రాజు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పుండరికం, డాక్టర్ అఖిల్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● కోల రవీందర్ ముదిరాజ్ పిలుపు ● సూరారం కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మట్టి గణపతులు, చేతి సంచుల పంపిణీ ● ప్లాస్టిక్ వాడకాన్ని నివారిస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీ





**సూరారం, సెప్టెంబర్ 11, (వార్తాప్రభ) :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ పరిధిలోని సూరారం కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ హిత మట్టి వినాయక ప్రతిమలు, చేతి సంచుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సుమారు 200 మట్టి విగ్రహాలను, 300 వస్త్ర చేతి సంచులను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోల రవీందర్ ముదిరాజ్ విద్యార్థులతో ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్న ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా విడనాడాలని, నిత్యం చేతి సంచులనే వినియోగించేలా తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పిస్తామని విద్యార్థులు ప్రతినబూనారు. కూరగాయలు, పండ్లు తదితర నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసేందుకు దుకాణాలకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా చేతి సంచులను వెంట తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై పాఠశాల పరిసర ప్రాంతాల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల్లో చిన్నతనం నుంచే పర్యావరణ స్పృహను పెంపొందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఉపాధ్యాయులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు పుణ్యవతి, ఉపాధ్యాయుడు మల్లికార్జున్, తోటి అధ్యాపక బృందం, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# సాయుధ రైతాంగ పోరాటం అజరామరం

● నయా రాచరిక పాలకులపై ఉద్యమిద్దాం ● సాయుధ పోరాటంలో కాషాయ పాత్ర శూన్యం ● సమరశీల పోరాటాలతో అమరుల ఆశయాలు సాధిద్దాం ● సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా ● ఘనంగా ప్రారంభమైన సాయుధ పోరాట వారోత్సవాలు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్ / కొత్తగూడెం : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్ర అజరామరమైనదని, నాడు సాగిన వీరోచిత పోరాటాల స్ఫూర్తితో నేటి నయా రాచరిక పాలకులపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. చారిత్రక తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ప్రారంభ సభ మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు అధ్యక్షతన శుక్రవారం సుజాతనగర్ మండలం నాయకులగూడెం గ్రామంలో నిర్వహించారు పోరాటానికి పిలుపునిచ్చిన నేత రావి నారాయణరెడ్డి స్థూపం వద్ద పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం ఎర్రజెండాను ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన సభలో సాబీర్ పాషా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నిజాం నవాబు నిరంకుశ పాలనకు, దేశ్‌ముఖ్‌ల భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన మహత్తర సాయుధ పోరాటం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. వెట్టిచాకిరీ విముక్తి కోసం, భుక్తి కోసం, 'దున్నేవాడికే భూమి' హక్కు కోసం వేలాది మంది కమ్యూనిస్టు యోధులు రక్తతర్పణం చేసి పేదలకు భూములను పంచిపెట్టారని గుర్తుచేశారు. ఆనాడు కమ్యూనిస్టుల రక్తంతో లిఖించబడిన మహోజ్వల పోరాట చరిత్రలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పాత్ర ఇసుమంత కూడా లేదని ఆయన స్పష్టం చేశారు. నాడు నయాపైసా త్యాగం చేయని మితవాద శక్తులు, నేడు సాయుధ పోరాటాన్ని హైజాక్ చేసేందుకు తెగబడుతుండటం సిగ్గుచేటన్నారు. వర్గ పోరాటాన్ని హిందూ--ముస్లిం గొడవగా చిత్రీకరిస్తూ, చరిత్రను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. అమరుల ఆశయాలు నేటికీ నెరవేరలేదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజాస్వామ్య రక్షణ కోసం సమరశీల ఉద్యమాలను నిర్మించాలని కోరారు. అనంతరం నాయకులగూడెంలోని సాయుధ పోరాట యోధులు కొమారి రామయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర సమితి సభ్యులు సలిగంటి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు వి పూర్ణచందర్ రావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, జి వీరాస్వామి, కందుల భాస్కర్, భూక్య దస్రు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, భూక్య శ్రీనివాస్, కె రత్నకుమారి, వర్క అజిత్, నాయకులు ఎండి యూసుఫ్, సత్యనారాయణ చారి, దండు నాగేశ్వర్ రావు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు భూక్యా శాంతిశ్రీ, బోయిన విజయ్ కుమార్, బండి నర్సింహా, దుర్గయ్య, నిమ్మల రాంబాబు, వై ఎస్ గిరి, మల్లేష్, బొడ్డు,కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

హైదరాబాద్

# గణేష్ ఉత్సవాలలో పర్యావరణహిత విగ్రహాలనే ప్రోత్సహించండి

**- బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చిర్ర రవీందర్ యాదవ్**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ):** గణేష్ ఉత్సవాల్లో పర్యావరణహిత విగ్రహాలను ప్రోత్సహించాలని తెలంగాణ ఉద్యమకారుడు,బీఆర్ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు చిర్ర రవీందర్ యాదవ్ పిలుపునిచ్చారు.ఈ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా.జి. సృజనను మర్యాదపూర్వకంగా కలిసి విత్తన గణేష్ విగ్రహాన్ని అందజేశారు. మట్టి, విత్తనాలతో రూపొందించిన విగ్రహాల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మిద్దెల మల్లారెడ్డి,గంగారాం,సంగారెడ్డి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలలో పర్యావరణ హితాన్ని పెంచుతున్న చిర్ర రవీంద్ర యాదవ్ అభినందనీయులు

**-బి.ఆర్.ఎస్.ఇంచార్జ్ కేటీఆర్ అభినందనలు**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ):**పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా సీడ్ గణపతుల పంపిణీ కార్యక్రమం చేపట్టిన తెలంగాణ ఉద్యమ నాయకుడు,బీఆర్ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు చిర్రా రవీందర్ యాదవ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో 5 వేల సీడ్ గణపతి విగ్రహాల పంపిణీకి కేటీఆర్ చేతుల మీదుగా శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేలా సీడ్ గణపతుల పంపిణీ చేపట్టడం మంచి నిర్ణయమని ప్రశంసించారు. వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించేందుకు రవీందర్ యాదవ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో పర్యావరణ స్పృహను పెంచుతాయని పేర్కొన్నారు.అనంతరం రవీందర్ యాదవ్ మాట్లాడుతూ పూజ అనంతరం నిమజ్జనం చేసినప్పుడు విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా ఎదిగేలా సీడ్ గణపతులను రూపొందించినట్లు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉన్నందున మట్టి, సహజ పదార్థాలతో రూపొందించిన విగ్రహాలను వినియోగించాలని సూచించారు.ప్రతి ఇంటికీ ఒక సీడ్ గణపతి చేరేలా కార్యక్రమాన్ని విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు.

# ఓటర్ల జాబితా సవరణ పనులు మరింత వేగవంతం చేయండి.

**-తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి**

**శేరిలింగంపల్లి,సెప్టెంబరు 11 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా తీవ్ర సవరణ (ఎస్ఐఆర్)-2026 ప్రక్రియను తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించి.. పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.శేరిలింగంపల్లి ఈఆర్ఓ, జెడ్సీ నారాయణ్ అమిత్,ఐఏఎస్ సీఈఓ వెంట ఉండి ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఓటర్ల జాబితా సవరణ పనులను మరింత వేగవంతం చేయాలని సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.



నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకత, ఖచ్చితత్వంతో పనులు చేపట్టాలని సూచించారు.ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, క్రమబద్ధంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.తద్వారా నమ్మకమైన, తాజా ఓటర్ల జాబితాను సిద్ధం చేయగలమని పేర్కొన్నారు.

# విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోండి..!

**రాత్రివేళ ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరుతో కరెంట్ కోతలు.. ప్రజల అవస్థలు...**

**పట్టణాలలో ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ ఉండదా..? కేవలం గ్రామాల్లోనే ఉంటుందా... ?**

**పెనుగంచిప్రోలు - సెప్టెంబర్ 11( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండలం లో ప్రతిరోజూ రాత్రి 7 నుంచి 10 గంటల మధ్య విద్యుత్ సరఫరాకు అంతరాయం.చిన్నారులు, వృద్ధులు, మహిళలకు తీవ్ర ఇబ్బందులు అనారోగ్యం తో పాదపడే వారి పరుస్థితి వర్ణ తీతం,గతంలో లేని ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ ఇప్పుడే ఎందుకు ?అంటూ ప్రజల ప్రశ్న. సమస్యను పరిష్కరించకపోతే ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగే అవకాశం,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న తరుణంలో.. విద్యుత్ శాఖలో మాత్రం తరచూ ఎదురవుతున్న విద్యుత్ అంతరాయాలు ప్రజలను తీవ్ర అసహనానికి గురిచేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.ముఖ్యంగా



గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిరోజూ రాత్రి సుమారు 7 గంటల నుంచి 10 గంటల మధ్య "ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్" పేరుతో విద్యుత్ సరఫరానిలిచిపోతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళ చిన్నారులు నిద్రకు ఉపక్రమించే సమయంలోనే కరెంట్ పోవడంతో ఇళ్లలో దోమల బెడద పెరిగి, చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు.గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పెద్దగా వినిపించలేదు. ఇప్పుడు ప్రతిరోజూ ఎందుకు ఈ పరిస్థితి !అంటూ గ్రామాల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ కోతలకు అసలు కారణం ఏమిటి ? నిజంగానే అత్యవసర పరిస్థితి ఉందా ? ఉంటే ఎందుకు ప్రతిరోజూ ఒకే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది? అనే ప్రశ్నలకు విద్యుత్ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.కూటమి నేతలు ఎందుకు పట్టించుకోవడం లేదు ? ప్రభుత్వంపై ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్పడేలా స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పనిచేయాల్సిన సమయంలో.. విద్యుత్ సమస్యపై మాత్రం తగిన స్థాయిలో స్పందన కనిపించడం లేదనే అసంతృప్తి ప్రజల లో వ్యక్తమవుతోంది.ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఏదైనా వ్యవస్థ పనిచేస్తుందా? లేక సాంకేతిక కారణాలతోనే ఈ కోతలు జరుగుతున్నాయా? అన్నది విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది.ప్రతిరోజూ రాత్రి గంటల తరబడి విద్యుత్ లేకపోవడం వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై అసహనం పెరుగుతోందని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖలో ఉన్న సమస్యలను కూటమి ప్రభుత్వ పెద్దలు సీరియస్‌గా తీసుకుని, అధికారులు పరిస్థితిని సమీక్షించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే పరిస్థితి వద్దుప్రజలకు అవసరమైన సమయంలో విద్యుత్ అందకపోతే ప్రభుత్వంపై సహజంగానే వ్యతిరేకత ఏర్పడే అవకాశం ఉంటుందని పలువురు పెద్దలు అభిప్రాయపడుతున్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజల రోజువారీ సమస్యలు రాజకీయ ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.అయితే విద్యుత్ కోతలకు వాస్తవ కారణం ఏమిటన్నది విద్యుత్ శాఖ అధికారుల అధికారిక వివరణతోనే స్పష్టమవుతుంది.

# సంపాదకీయం

## పోతే పోనీ...వైసీపీ నిబ్బరానికి జోహారు !

మహా కవి శ్రీశ్రీ రాసిన ఒక కవితలోని కొన్ని పక్తులు వైసీపీని చూస్తే గుర్తుకు వస్తే ఆశ్చర్యం లేదనే అంటారు. పోనీ, పోనీ, పోతే పోనీ సతుల్ సుతుల్ హితుల్ పోనీపోతే పోనీ రానీ రానీ వస్తే రానీ కష్టాల్, నష్టాల్ కోపాల్ తాపాల్ శాపాల్ రానీ అని మహా కవి రాశారు. ఈ కవిత సారం ఏమిటి అంటే కష్టాలు నష్టాలు ఎన్ని అయినా ఎదురు కానీ వాటిని దాటి ముందుకు అడుగులు వేయమని చెప్పే చైతన్యవంతమైన గీతం. బహుశా ఈ గీతాసారం వైసీపీకి బాగా నచ్చి ఉంటుంది. వైసీపీ కూడా ఏ కష్టం ఎదురైనా ఏ నష్టం వచ్చి తలుపు తట్టినా కూడా చలించేది ఉండదని అంటారు. మహా కవి కవిత మాదిరిగా నిబ్బరంగా అలా ముందుకు సాగిపోతుంది. ఆ పార్టీ అదే తన మొత్తం ప్రస్థానంలో నేర్చుకుంది. అలాగే ఈ రోజుకీ ఉంది. వైసీపీ ఆవిర్భావం నుంచి ఎంతో మంది నాయకులు ఆ పార్టీలోకి వచ్చారు, వెళ్ళిపోయారు. ఎంతో మంది సెలిబ్రిటీలు చేరారు, వేనక్కి జారారు, పార్టీ పునాదుల నుంచి ఉన్న వారు, సొంత కుటుంబీకుల మాదిరిగా తరాలుగా ఉంటూ వచ్చిన వారు, ఇలా ఎంతో మంది వైసీపీకి బై బై చెప్పారు. దిగ్గజ నేతలు పోయినా వారి వల్ల ఆ జిల్లాలలో నష్టం వాటిల్లుతుందని తెల్సినా వైసీపీ తొణకలేదు, బెణకలేదు, ఉంటే ఉంచుకుంది, తనతో కలిసి నడవమంది, పోతే సరే అనుకుంది. ఇదే వైసీపీ పొలిటికల్ ఫిలాసఫీగా ఉంటూ వస్తోంది. వైసీపీ తీరే సెపరేట్ అనేట్లుగా ఆ పార్టీ అనుసరిస్తున్న విధానాలు ఉంటాయని చర్చ కూడా సాగుతుంది. సాధారణంగా రాజకీయ పార్టీలు తమ బలాన్ని పెంచుకోవాలని చూస్తాయి. వంద మంది ఉన్నా వారిని కాపాడుకుంటూ 101 కోసం వెంటాడుతాయి, వేటాడుతాయి. ఇక ఎవరైనా పార్టీలో అసంతృప్తితో ఉన్నారని తెలిస్తే వారికి బుజ్జగింపులు ఉంటాయి, రాయబారాలు ఉంటాయి, ఏదో ఒకటి చేసి తిరిగి విశ్వాసంలోకి తీసుకుంటాయి. నిజానికి కుటుంబంలోనూ అలాగే ఉంటుంది, మనస్పర్థలు అన్నవి సహజం. వాటిని చక్కదిద్దుకుంటూ పోతేనే అంతా కలిసి ఉంటారు, లేదు అనుకుంటే విడిపోతారు. అయితే వైసీపీ ఇలాంటి వాటికి దూరం అని చెబుతారు. ఎంతటి నాయకుడు వెళ్ళిపోయినా వైసీపీ పెద్దగా స్పందించదు అని అంటారు. వారికి ఇష్టం లేకపోతే కట్టి పడేసి ఉంచగలమా అన్నది వైసీపీ ఆలోచనగా చెబుతారు. ఇది కూడా కరెక్టే అనుకున్నా ప్రాథమికంగా చేయాల్సినవి ఉంటాయి కదా అనుకున్నా వైసీపీ వరకూ చూస్తే అలాంటి ట్రెడిషనల్ పాలిటిక్స్ ని నమ్మినట్లుగా కనిపించదు. వైసీపీ నేతలు ఎపుడూ చెప్పేది ఒక్కటే మాట. జగనే పార్టీ అని. ఆయనతోనే వైసీపీ అని. జగన్ ఒంటరిగా వచ్చి పార్టీ పెట్టి ఇంతటి పార్టీని చేశారు అని చెబుతారు. జగన్ లేకుంటే ఎవరూ లేరు, జగన్ కాకుంటే ఎవరూ వద్దు అని కూడా అంటారు. జగన్ ని చూసి జనాలు ఓటేస్తారు, ఆయన ఇమేజ్ తోనే పార్టీ గెలిచినా ఓడినా అని కూడా అంటారు. నిజానికి వైసీపీ అధినేతకు జనంలో ఇమేజ్ గ్లామర్ ఉన్నాయి, కానీ కేవలం నాయకుడితో మాత్రమే పార్టీ నడవదు కదా అన్న ప్రశ్నలు కూడా వస్తాయి, అయితే వీటికి లాజికల్ గా వైసీపీ చెప్పే సమాధానాలు ఏమీ ఉండవని అంటారు. తమ పార్టీకి జగనే సర్వస్వం అని నేతలు చెబుతారు. జగన్ అంటే జగమంత కుటుంబంగా నమ్ముతారు. బహుశా వైసీపీకి ఇదే అతి పెద్ద బలం, అదే బలహీనత కూడా. ఈ విధంగానే సాగుతూ ఒకసారి గెలిచింది. మళ్లీ గెలవాలని చూస్తోంది. సో వైసీపీ పొలిటికల్ ఫిలాసఫీ అయితే ఇదే. అందుకే ఎవరు వెళ్ళిపోయినా సరే మిగిలిన పార్టీల మాదిరిగా వైసీపీలో సమీక్షలు మీటింగులు అలెర్ట్ కావడాలూ వంటివి ఉండవని అంటారు.

## సీతమ్మవారి పాదాల వద్ద వినాయక నిమజ్జన ప్రదేశంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు







**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 11 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గౌరీ సూచనలతో శుక్రవారం ఉదయం సీతమ్మవారి పాదాల వద్ద వినాయక నిమజ్జనం నిర్వహించే ప్రదేశంలో పారిశుధ్య, ప్రజారోగ్య విభాగాల సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. వినాయక నిమజ్జన కార్యక్రమానికి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున, నిమజ్జన ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రాంగణంలోని వ్యర్థాలను తొలగించడం, పరిసరాలను శుభ్రం చేయడం, చెత్త పేరుకుపోకుండా చూడటం వంటి పారిశుధ్య చర్యలు నిర్వహించారు. నిమజ్జన ప్రదేశంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా, ప్రజారోగ్య పరిరక్షణకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణమే చర్యలు చేపట్టేలా అధికారులు సిబ్బందికి సూచనలు చేశారు.

## చెకుముకి టాలెంట్ టెస్టు లో ఉత్తీర్ణులైన విద్యార్థులు

**పెనుగంచిప్రోలు – సెప్టెంబర్ 11( వార్త ప్రభ )** జన విజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో 8, 9 మరియు 10 వ తరగతి విద్యార్థులకు 'పెనుగంచిప్రోలు మండల స్థాయిలో' నిర్వహించిన "చెకుముకి టాలెంట్ టెస్ట్" లో 8వ తరగతి నుండి (పి.వికాస్, వై.వై.లక్ష్మి నరసింహ), 9వ తరగతి నుండి (జె . వర్షిత్, బి . హరి ప్రియ) 10వ తరగతి నుండి (కె . ఊహా శాలిని, బి . కార్తీక) విద్యార్థులు ప్రథమ మరియు ద్వితీయ శ్రేణీలో ఉత్తీర్ణులై తదుపరి సెప్టెంబర్ 27 న జరగబోయే జిల్లా స్థాయి పరీక్ష కు ఎన్నికవ్వడం జరిగినది. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు ఎండ్ల వెంకట రమణమ్మ చుక్కా శ్రీ లక్ష్మి , పాఠశాల ప్రిన్సిపాల్ జి. శేషగిరి కరెస్పాండెంట్ ఎం . సుధీర్ మరియుఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించడం జరిగినది.





# 121వ, పురస్కారం అందుకొన్న రంగస్థల కళాకారుడు డాక్టర్ వేము వందనం




**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 11 :(వార్త ప్రభ ప్రతినిధి)**రంగస్థల నటుడుగా, దర్శకులుగా, రచయితగా ఎన్నో అవార్డులు తన ఖాతాలో వేసుకొన్న డాక్టర్ వేము వందనం తన కేరీరులో 121వ, పురస్కారం మైలురాయి చేరుకొన్నారు. సరేగా మ్యూజికల్ స్టుడియో, హిమాయత్ సాగర్ లో ఇందిరా ఆర్ట్ ఫౌండేషన్ తెలంగాణ, ఇంటర్ నేషనల్ బుక్ ఆఫ్ ప్లాటీనం రికార్డు..2026 పేరున మెగాస్టార్ చిరంజీవి గారి జన్మదిన వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. నిష్ణాతులైన బుల్లి తెర, వెండి తెర, రంగస్థల కళాకారులుకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా భవానీ కాలనీకి చెందిన కవి,, రచయిత, నటుడు, దర్శకులు, ప్రయోక్త డా వేము వందనం ఉత్తమ రంగస్థల కళాకారుడు..2026లి పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, డా ఎన్ ఇందిరా, చైర్మన్, ఇంటర్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ డా ఆలూరి విల్సన్, ముఖ్య అతిథి రచయిత డా రామకృష్ణ చంద్రమౌళి , సీన్ దిగ్గజం డా సి ఆర్ మాణిక్యం , రచయిత, సిటీ సివిల్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ డాక్టర్ పి వి పి అంజనీ కుమారి , ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి హెచ్ ప్రసన్న , డబ్బింగ్ ఆర్టిస్టులు డాక్టర్ పి అనురాధ , వై బి వెంకటేశ్వర




రావు, డాక్టర్ జి విజయ కుమార్ , రమాకాంత్ , పి గోవింద రాజులు తదితరులు వేదికపై ఆసీనులై ఉన్నారు. డాక్టర్ వేము ఫౌండేషన్ తాను1971లో పిచ్చి రాజు ఇంటర్వ్యూ నాటికతో రంగ ప్రవేశం చేసి ఇప్పటికి వందకు పైగా నాటిక/నాటికలు ప్రదర్శించి, 30 పైగా రచించి, రచయితగా, దర్శకునిగా, నటనలో పి జి డిప్లొమా, ఎమ్ ఎ చదివి, వ్యవసాయ విశ్వవిద్యాలయం లో పరిపాలనాధికారిగా పదవీ విరమణ చేసి వృత్తి, ప్రవృత్తికి సమన్వాయం చేకూర్చి 121వ పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉంది అని తెలిపారు.

## ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి

- లై సెన్స్ లేకుండా చిన్నారులు ద్విచక్ర వాహనాలు నడపరాదు
- రోడ్డు పైన ప్రయాణం రూల్స్ ప్రకారమే సాగించాలి
- విద్యార్థిని విద్యార్థులకు ట్రాఫిక్ సీ ఐ ఎమ్ సురేష్ అవగాహనా కార్యక్రమం

**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 11 :(వార్త ప్రభ ప్రతినిధి )** ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజ శేఖర్ బాబు ఆదేశాలుమేరకు ట్రాఫిక్ డీ సీ పి శ్రీమతి షరీనా బేగం పర్యవేక్షణలో శుక్రవారం 2టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లో గల రాయల్ హోటల్ సెంటర్ దగ్గరగల "మౌలానా ఆజాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ హై స్కూల్" నందు స్కూల్పిల్లలకు సీ ఐ ఎమ్ సురేష్ ట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన ట్రాఫిక్ నిబంధనలుపై అవగాహన కల్పిస్తూ, రోడ్డు క్రాస్చేసేటప్పుడు ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలి,రోడ్డు మీద సైకిల్ పై వెళ్ళేటప్పుడుతీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, ఆలాగే రోడ్డు మీద నడచి వెళ్ళేటప్పుడుతెసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, చిన్న వయస్సులో లైసెన్స లేకుండా బండినడపడం వల్ల కలిగే ధో ష ప్రభావాలు విషయాలు పై 6 నుండి10తరగతుల పిల్లలకు ట్రాఫిక్ అవగాహన కల్పించారు. అంతే గాకుండా పిల్లలు బైక్ రైడ్ కోసం మారాము చేసినా తల్లిదండ్రులు కూడా తమవంత భాధ్యతగా వారి



వారి పిల్లలకు మంచి చెడు వివరించి నచ్చ చెప్పాలిగాని అడిగిన వెంటనే ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని సీ ఐ సురేష్ హితావు పలికారు. అలాగే ఉధ్యాయులు కూడా అప్పుడప్పుడు ట్రాఫిక్ నిబంధనలు విద్యార్థులకు గుర్తు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఆకాశాన్ని అంటుతున్న నిత్యవసరాల ధరలకు నిరసనగా సిపిఐ "వినూత్న నిరసన" !

### దళారులకు పండగ, సామాన్యునికి దండగగా మారిన కూటమి పాలన !




**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 11 :(వార్త ప్రభ ప్రతినిధి )**రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతుంటే, సామాన్యుడు మాత్రం పండగ పూట కూడా పస్తులుండే పరిస్థితులు ఈ కూటమి ప్రభుత్వ పాలనలో దాపురించాయని సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేసారు. శుక్రవారం స్థానిక విద్యాధరపురం సితార సెంటర్లో సిపిఐ స్థానిక డివిజన్ల ఆధ్వర్యంలో నగర కార్యదర్శివర్గ సభ్యురాలు పంచదార్ల దుర్గాంబ అధ్యక్షతన వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా పాల్గొన్న సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిత్యావసరాల ధరలు అమాంతంగా రెండు నుండి మూడు రేట్లు పెరగడం జరిగింది అని అందుకు తగిన విధంగా సామాన్య ప్రజల ఆదాయం పెరగక పోవడంతో పేద, మధ్యతరగతి రానున్న పండగ రోజులని కూడా దండగ రోజులుగా భావిస్తు ప్రజలు ఆకలిని,ఆశలను చంపుకొని బతకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసారు. రాష్ట్రంలో కూటమి నాయకులు మేము అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యవసరాల ధరలు తగ్గించి పేదవానికి అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ధరల తగ్గించడం పక్కకు పెట్టి గతంలో అంటే 2024 నాటికీ ఉన్న ధరలను అమాంతం పైకి ఎగబాయించి సమస్య ప్రజలకు కనీసం ఆకలి తీర్చుకునే అవకాశం కూడా లేకుండా చేసే విధంగా ధరల పెరుగుతున్నప్పటికీ కూటమికి ప్రభుత్వం ధరల నియంత్రణకు ఎటువంటి చర్యలు చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని. మరో పక్క రాష్ట్రంలో ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుకు గిట్టుబాటు ధర లేక ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. మరి పెరిగిన ఈ ధరల వ్యత్యాసం ఎవరి జేబుల లోకి చేరుతుందని ప్రశించారు. గిట్టుబాటు ధరల కల్పనకు పటిష్ట చర్యలు చేపట్టకుండా, దళారీ, బ్లాక్ మార్కెట్ వ్యవస్థకు కొమ్ముకాస్తూ పెట్టుబడి దారులకు సంపద సృష్టే ప్రధాన ఏజెండగా పాలనా సాగిస్తుందని ఎద్దేవా చేసారు. మరి ఈ అధిక ధరలను అందుకునే స్థాయిలో సామాన్యుని ఆదాయం పెరిగిందా అని ప్రభుత్వాన్ని ప్రశించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా నిత్యవసరాలైన బియ్యంతో పాటు,చక్కర,వంటనూనె, పప్పులు వంటి 14 రకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని,అదేవిధంగా ధరల స్థిరీకరణకు,బ్లాక్ మార్కెట్ నిరోధానికి పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు,నక్క వీరభద్రరావులు మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో ప్రజల ఆహార అవసరాలు తీర్చే బియ్యం ధర కేవలం రెండు నెలల వ్యవధిలో బస్తాకు 500 రూపాయలు పెరగడం,వంట నూనె,చక్కెర, ఉల్లిపాయలు,పప్పులు ఇలా ఏది కొనాలన్న సామాన్యుడు భయపడే పరిస్థితి నెలకొన్నదని, పెరుగుతున్న నిత్యవసరాల కొరత ఆసరాగా చేసుకొని దళారులు నిత్యవసరాలను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తూ ప్రజల అవసరాలను వారి ఆదాయవనరులుగా మారుస్తుంటే పాలకులు బ్లాక్ మార్కెట్ దళారులకు,పెట్టుబడి దారులకు సంపద సృష్టిస్తూ సామాన్యునికి వెన్నుపోటు పొడుస్తోందని, మరో పక్క కేంద్ర ప్రభుత్వం యుద్ధాల పేరుతో పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలను రికార్డు స్థాయికి పెంచి వారి రికార్డులను వారే అధికమించే దిశగా పాలనా సాగించడంతో ధరల పెరుగుదలకు ఈ రోజు రవాణా వ్యయం పెరగటం కూడా ఒక ప్రధాన కారణంగా చెప్పవచ్చు అని అన్నారు. ప్రజలకు నిత్యవసరాలను అందుబాటులోకి తెచ్చేందుకు తక్షణం చర్య క్రింద చౌకధరల దుకాణాల ద్వారా 14 రకాల నిత్యవసరాలను అందిచాలని లేని పక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు అనే ఆయుధం ద్వారా పాలక ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. నగర కార్యవర్గ సభ్యులు బుద్దే రాజా కార్యక్రమానికి వందన సమర్పణ చేసి నిరసన కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడియ్య, కొట్టు రమణారావు, డివిజన్ కార్యదర్శులు ఉప్పలపాటి శివ ప్రసాద్ రాజు, టి. పూర్ణయ్య, డివిజన్ నాయకులు అంజూరి సూరిబాబు, ఎ.వి.రంగారావు, నడికుదిటి వెంకటేశ్వరరావు, దోమతోటి రాంబాబు, కోటా రాంబాబు, భగవాన్, నక్కా నాగేశ్వరరావు,దాసరి రంగారావు,పి.అప్పారావు , ఎఐవైఎఫ్ నగర అధ్యకులు కంచర్ల భార్గవ్, నాయకులు లంకే సాయి,పి.విశాల్,అభి, టి.అవినాష్,మహిళా సమాఖ్య నాయకులు అండిమాని నాగమణి,పడాల తవుడమ్మ, అప్పికొండ లక్ష్మీ,మురళి సాయి మణి తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ కోర్టులో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా




**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 11 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ నగరంలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్య పరిరక్షణకు విఘాతం కలిగించే చర్యలపై కఠిన చర్యలు కొనసాగిస్తోంది. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు శుక్రవారం సర్కిల్-1 కార్యాలయంలో సంచార న్యాయస్థానం (మొబైల్ కోర్టు) నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, రహదారులపై చెత్తాచెదారం వేయడం, రోడ్లపై పశువులు మరియు పెంపుడు కుక్కలను విచ్చలవిడిగా వదిలేయడం, కాలువల్లో వ్యర్థాలు వేయడం ద్వారా మురుగునీటి పారుదలకు ఆటంకం కలిగించడం, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వారిని గుర్తించారు. ఈ ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 16 కేసులు నమోదు చేసి నిందితులను మొబైల్ కోర్టులో జడ్జి టి.ఎ.ఎస్.ఎస్.ఆర్.ఎ. రిషిక్ ఎదుట హాజరుపరిచారు. కేసులను విచారించిన జడ్జి నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించగా, మొత్తం రూ. 4,520/- జరిమానా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. రహదారులు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, నిబంధనలను పాటించి నగర పరిశుభ్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భవిష్యత్తులో కూడా మొబైల్ కోర్టుల ద్వారా కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్వైజర్లు డి. సోమరాజు, ఎస్.వి.ఎస్. శ్రీధర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు మరియు ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

### అర్జీలను స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తాం: మాజీ కార్పొరేటర్లు



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 11 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ మల్లికార్జున పేట పశ్చిమ నియోజకవర్గం బుద్దా వెంకన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుద్ధా వెంకన్న ఆదేశానుసారం శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు చందన సురేష్ (మామ), ఉమ్మడి చంటి, పైడిమాల సుభాషిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. విద్య, వైద్యం, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, సంక్షేమ పథకాలు తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు వారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని మాజీ కార్పొరేటర్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు, పార్టీ నాయకులకు మధ్య మరింత సమన్వయం ఏర్పడి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ,, అమర మురళి, ఈగల సాంబశివరావు, కొప్పుల గంగాధర్ రెడ్డి, పేరం సత్యనారాయణ, నందం భవని ప్రసాద్, వి వి కే నరసింహారావు, గోలి శ్రీను, బోసుబాబు, పిల్ల సుదర్శన్, , తుపాకుల రమణమ్మ, పితాని పద్మ, కునుకు కొండయ్య, కలవకొల్లు శ్రీనివాస రావు, (కే వి ఆర్ ), కామోజీ కామాక్షి, వల్లభనేని ప్రసన్న లక్ష్మి , మట్టే శ్రీ లక్ష్మి, దుర్గ, మల్లేశ్వరి, కొట్టేటి సరిత, ప్రియా, భార్గవి, సూరబత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న భక్త రామదాసు 10వ తరం వారసులు.





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 11 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారిని వాగ్గేయకారుడు, పరమ భక్తాగ్రేసరుడు అయిన భక్త రామదాసు (శ్రీ కంచర్ల గోపన్న) పదవ తరం వారసులు కంచర్ల శ్రీనివాసరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. ?ఇంద్రకీలాద్రికి చేరుకున్న భక్త రామదాసు వారసుల కుటుంబానికి ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ స్వయంగా సాదర స్వాగతం పలికి, శ్రీ అమ్మవారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీకనక దుర్గ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, ప్రధానాలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి శాస్త్రోక్తంగా వేద ఆశీర్వచనం అందజేశారు. ఈవో వి.కె. శీనా నాయక్ కంచర్ల శ్రీనివాసరావు దంపతులకు శ్రీ కనకదుర్గ అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు మరియు శేషవస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భక్త రామదాసు వారసులు కంచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ..భక్తి పారవశ్యంతో శ్రీరాముని కీర్తిస్తూ సంకీర్తనలతో రామభక్తిని నేల నాలుగు చెరగులా చాటిన భక్త రామదాసు వంశీయులుగా ఉండటం తమ పూర్వజన్మ సుకృతమన్నారు. జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో తమను ఎంతో ఆదరంగా ఆహ్వానించి, అత్యంత గౌరవప్రదంగా స్వయంగా ఆలయ ప్రధాన అధికారి అయిన ఈవో దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేయడం తమ కుటుంబానికి ఎంతో ఆనందాన్ని, ఆధ్యాత్మిక సంతృప్తిని ఇచ్చిందని పేర్కొంటూ దేవస్థాన యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

### టి ఎన్ టి యు సి బోండా ఉమా కు నాయకుల సత్కారం



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 11(వార్తా ప్రభ ప్రతినిధి):**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టి ఎన్ టి యు సి ఇన్చార్జి గా నియమితులైన విజయవాడ సెంట్రల్ నియోజవర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బోండా ఉమామహేశ్వరరావు టిఎన్టియుసి రాష్ట్ర కమిటీ నాయకులు సన్మానించారు. టి ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షులు, బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ చైర్మన్... గొట్టుముక్కల రఘురామరాజుటి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు డైరెక్టర్ రెంటపల్లి శ్యామ్, టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగవంశం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మొకర ఆదిబాబు,టి ఎన్ టి యు సి రాష్ట్ర కోశాధికారి ఆకుల సూర్య ప్రకాష్,టి ఎన్ టి యు సి సోషల్ మీడియా కోఆర్డినేటర్....లక్కిశెట్టి కనకారావు పాల్గొన్నారు.

## బామ్మ ప్రబోధ గీతిక

చెడ్డ వారి సహవాసము
తెచ్చిపెట్టును నాశనము
ఉండాలోయ్! దూరంగా
మసలాలోయ్! జాగ్రత్తగా
మంచిదైతే విత్తనము
ఫలము బాగుంటుందోయ్!
పవిత్రమైతే హృదయము
దైవ నిలయమవుతుందోయ్!
నిరంతర అభ్యాసము
సంపూర్ణతనిస్తుందోయ్!
బ్రతుకున ఐకమత్యము
అన్నీ సాధిస్తుందోయ్!
అదుపు చేస్తే కోరికలు
మదినిండా ఆనందము



నియంత్రిస్తే మనసులు
దొరుకు అఖండ విజయము

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

**● అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలి ● బాధ్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలి ● డీఎస్సీని ఉద్యోగాల మార్కెట్‌గా మార్చారనే ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి ● ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్..**

**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 11 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్‌లో 2025 డీఎస్సీ నియామక ప్రక్రియలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న పేపర్ లీకేజీ, భారీ అవకతవకలు, నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్ల వ్యవహారం, మెరిట్‌కు విరుద్ధంగా జరిగిన నియామకాలపై తక్షణమే సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని అఖిల భారత యువజన సమాఖ్య ( ఏ ఐ వై ఎఫ్ ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. విజయవాడలోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు జి. సంతోష్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. యుగంధర్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్. సుభాని మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. డీఎస్సీ అనేది రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ముడిపడిన అత్యంత కీలకమైన నియామక ప్రక్రియ అని, అలాంటి పరీక్షలో అక్రమాలకు తావిచ్చి అర్హులైన అభ్యర్థుల జీవితాలను నాశనం చేయడం దుర్మార్గమని అన్నారు. పేపర్ లీకేజీ జరిగిందా, ఎవరి ద్వారా జరిగింది?, ఎవరు లబ్ధి పొందారు, స్పోర్ట్స్ కోటాలో సమర్పించిన



సర్టిఫికెట్లు నిజమైనవేనా, వాటిని ఎవరు, ఎలా ధృవీకరించారు, మెరిట్ జాబితాను పక్కనపెట్టి నియామకాలు జరిగాయా, ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణల్లో నిజమెంత. ఈ ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. అర్హత, ప్రతిభ, మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు పొందాల్సిన యువతకు అన్యాయం జరిగి, అక్రమ మార్గాల్లో కొందరికి ఉద్యోగాలు దక్కితే అది కేవలం ఒక నియామక అవకతవక మాత్రమే కాదని, రాష్ట్ర యువత భవిష్యత్తుపై జరిగిన దాడి అని ఏఐవైఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి కష్టపడి చదివిన నిరుద్యోగుల కన్నీళ్లకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. డీఎస్సీ నియామకాలకు సంబంధించిన ప్రశ్నపత్రాల తయారీ నుంచి పరీక్ష నిర్వహణ వరకు, స్పోర్ట్స్ సర్టిఫికెట్ల పరిశీలన నుంచి తుది నియామక జాబితా వరకు ప్రతి దశను సి.బీ.ఐ విచారణ చేయాలని విద్యాశాఖ మంత్రి బాధిత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ డిమాండ్లపై వెంటనే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతను, డీఎస్సీ అభ్యర్థులను ఐక్యం చేసి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అర్హత ఉన్న ప్రతి అభ్యర్థికి న్యాయం జరిగే వరకు ఏఐవైఎఫ్ పోరాటం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, నాగభూషణ్, ఏఐవైఎఫ్ నాయకులు, సింగంశెట్టి మోహన ప్రసాద్, ఎస్ లాల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి ఆపరేషన్ చేయించుకున్న వారిని పరామర్శించిన ముప్పిడి నాగేశ్వరరెడ్డి



**రెడ్డిగూడెం సెప్టెంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కంటి చూపు ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో విలువైనదని, ఆ చూపును తిరిగి అందించడమే నిజమైన సేవ అనే సంకల్పంతో యంఎన్ఆర్ ఫౌండేషన్ ౘ శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వైద్య సేవల్లో భాగంగా మరో సేవా కార్యక్రమం కొనసాగింది. 10-09-2026న యంఎన్ఆర్ ఫౌండేషన్ ద్వారా శంకర కంటి ఆసుపత్రిలో అన్నేరావుపేట, కీర్తి రాయునిగూడెం గ్రామాలకు చెందిన 10 మంది శుక్లం (క్యాటరాక్ట్) ఆపరేషన్లు చేయించుకున్నారు. ఆపరేషన్లు చేయించుకున్న పలువురిని వీరీ= ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వర రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులతో కలిసి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు, ఆపరేషన్ ఎలా జరిగింది, ఆసుపత్రిలో అందుతున్న సేవలు ఎలా ఉన్నాయి అనే విషయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ చేయించుకున్న వారు మాట్లాడుతూ బస్సు సౌకర్యం, కంటి పరీక్షలు, శుక్లం ఆపరేషన్, టిఫిన్, భోజనం, రూమ్ సౌకర్యం వంటి సేవలను ఎటువంటి ఖర్చు లేకుండా యంఎన్ఆర్ ఫౌండేషన్ ద్వారా కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తమకు కంటి చూపు మెరుగుపడేలా సహకరించిన యంఎన్ఆర్ ఫౌండేషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విజ్ఞాన ప్రదర్శనతో విద్యార్థుల్లో సృజనాత్మకత.

**నిర్మల ఉన్నత పాఠశాలలో ఘనంగా సైన్స్ ఫెయిర్**



**మచిలీపట్నం సెప్టెంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకతను పెంపొందించేందుకు మచిలీపట్నంలోని నిర్మల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుధా సుసాయి ఆధ్వర్యంలో గురువారం పాఠశాల ఆవరణలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. పాఠశాలలోని తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ శాస్త్రీయ అంశాలకు సంబంధించిన నమూనాలు, ప్రయోగాలను ప్రదర్శించారు. ఆయా ప్రదర్శనల ఉద్దేశం, వాటి ఉపయోగాలు, శాస్త్రీయ విధానాలను తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వివరించారు. విద్యార్థుల ఆసక్తి, ప్రతిభను చూసి ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సుధా సుసాయి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు మంచి వేదికలుగా నిలుస్తాయని అన్నారు. పుస్తకాల్లో నేర్చుకున్న విజ్ఞానాన్ని ఆచరణలో ప్రదర్శించడం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను ఆమె అభినందించారు. ప్రదర్శనల్లో 8వ తరగతి విద్యార్థిని లక్ష్మీ మైత్రేయ, 7వ తరగతి విద్యార్థిని ఎస్తేరు తదితరులు రూపొందించిన నమూనాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. వారి ప్రదర్శనలను ఉపాధ్యాయులు అభినందించారు.

## డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం మానుకోవాలి - ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**డీఎస్సీ ని పూర్తి పారదర్శకంగా నిర్వహించాం**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 11 :(వార్త ప్రభ ప్రతినిధి)** డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ లోని తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాక్షి పత్రికలో ప్రచురిస్తున్న వార్తల్లో వాస్తవాలు లేవని, డీఎస్సీ, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వారు కూడా నియామకాలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. స్పోర్ట్స్ కోటా నిబంధనలపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలకు అధికారులు ఇప్పటికే స్పష్టమైన వివరణ ఇచ్చారని ఎంపీ తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ప్రకారం నేరుగా కేటాయింపులు జరుగుతాయని, అభ్యర్థుల ఎంపికలో మెరిట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ వంటి ప్రక్రియలు ఉంటాయని చెప్పారు. స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న వారు ఆధారాలు చూపాలని సవాల్ చేశారు. డీఎస్సీని పూర్తి పారదర్శకంగా నిర్వహించి సుమారు 16 వేల మందికి ఉద్యోగాలు కల్పించామని, వారు ఇప్పటికే విధుల్లో ఉన్నారని ఎంపీ చిన్ని పేర్కొన్నారు. తొమ్మిది నెలల తర్వాత ఇప్పుడు డీఎస్సీపై వైసీపీ నేతలు చేస్తున్న రాద్ధాంతం వారి రాజకీయ ఉద్దేశాలను స్పష్టం చేస్తోందన్నారు. రామకృష్ణ విషయంలో వైసీపీ అనుకూల మీడియాలో తప్పుడు కథనాలు ప్రచురించారని, ఆయన ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న విషయం ఇందుకు సజీవ సాక్ష్యమని ఎంపీ తెలిపారు. వాస్తవాలను తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు.. ఏపీపీఎస్సీలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై విచారణ కొనసాగుతోందని, గ్రూప్-1 అంశంపై కోర్టు ఆదేశాల మేరకు విచారణ జరుగుతోందని ఎంపీ చిన్ని తెలిపారు. త్వరలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే వైసీపీ నేతలు డీఎస్సీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బహిరంగ చర్చకు సిద్ధమని ఇప్పటికే సవాల్ చేశారని, దమ్ముంటే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆ సవాల్‌ను స్వీకరించి అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ఎంపీ చిన్ని అన్నారు. ప్రజలకు ఉద్యోగాలు, కుటుంబాల్లో ఆనందం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మబోరని, రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఎంపీ చిన్ని పేర్కొన్నారు. అనంతరం వేముల రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల రాధిక అనే మహిళ తన పేరును ప్రస్తావిస్తూ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని వేముల రామకృష్ణ స్పష్టం చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో నిర్వహించిన పరీక్షలో తనకు 104 మార్కులు మాత్రమే వచ్చాయని, తనకు ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగం రాలేదని తెలిపారు. తాను రూ. 15 లక్షలు చెల్లించి డీఎస్సీ ఉద్యోగం కొనుగోలు చేశానంటూ తనపై ఆరోపణలు చేయడం తీవ్రంగా బాధించిందని అన్నారు. నిజంగా తనకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చి ఉంటే, తాను ప్రస్తుతం ఏ స్థానంలో ఉన్నానో ఆధారాలతో చూపించాలని సవాల్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం తనను దోషిగా చూపించే ప్రయత్నం జరుగుతోందని, తన గురించి ఎవరైనా పూర్తిస్థాయిలో విచారణ చేసుకోవచ్చని వేముల రామకృష్ణ స్పష్టం చేశారు. ప్రస్తుతం కూడా తాను ఉదయం నుంచి రాత్రి వరకు ప్రైవేటు విద్యాసంస్థలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఎల్ ఓ సీ అందజేత



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 11 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్ ఓ సీ ను బాధిత కుటుంబానికి భవాని పురం ఎన్డీయే కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య , ఎన్టీఆర్ జిల్లా టీడీపీ యస్ సీ సెల్ నాయకురాలు తుపాకుల రమణమ్మ తో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. చెరువు సెంటర్ కు చెందిన ఆర్ సత్యనారాయణ (41) లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 4.75 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.. గొల్లపాలెం గట్టు ప్రాంతానికి చెందిన అగురు కృష్ణవేణి ( 54) మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 2 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు. త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేసిన ఎమ్మెల్యే సుజనా కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. 43 వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షుడు బొల్లేపల్లి కోటేశ్వరరావు, 45 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, టీడీపీ నాయకురాలు పితాని పద్మ, బీజేపీ నేత బాల సుబ్రమణ్యం, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు..

## శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతికి రోటరీ ప్రతినిధుల ప్రశంసలు

**- మౌలిక వసతులు, సమగ్ర పారిశ్రామిక వాతావరణంపై మద్రాస్ ఈస్ట్ రోటరీ క్లబ్ బృందం ఆసక్తి**





**శ్రీసిటీ, సెప్టెంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, సమగ్ర పారిశ్రామిక వాతావరణం తమను విశేషంగా ఆకట్టుకున్నాయని రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్ (ఆర్‌సీఎంఈ) ప్రతినిధులు ప్రశంసించారు. క్లబ్ అధ్యక్షురాలు రోటేరియన్ రాధిక సత్యనారాయణ నేతృత్వంలో 22 మంది సభ్యులతో కూడిన ప్రతినిధి బృందం శుక్రవారం శ్రీసిటీని సందర్శించింది. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు తదితర వృత్తి రంగాలకు చెందిన ప్రముఖులు బృందంలో ఉన్నారు. శ్రీసిటీలోని ఆర్చురా ఫార్మా ఎండీ, క్లబ్ సభ్యుడు విక్రమ్ ఈ పర్యటనను సమన్వయం చేశారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్ ప్రతినిధులకు స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రత్యేకతలు, వ్యూహాత్మక ప్రయోజనాలు, మౌలిక వసతులు, పారిశ్రామిక వాతావరణం, అంతర్జాతీయ పెట్టుబడులకు అందిస్తున్న అవకాశాలను వివరించారు. అనంతరం శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డితో ప్రతినిధి బృందం సమావేశమైంది. సమగ్ర, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధి దిశగా శ్రీసిటీ చేస్తున్న కృషిని ఆయన వివరించారు. సమాజ సేవలో ఆర్‌సీఎంఈ అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. పర్యటన ఎంతో ఆసక్తికరంగా, విజ్ఞానదాయకంగా సాగిందని రాధిక సత్యనారాయణ పేర్కొన్నారు. శ్రీసిటీ సమగ్ర ప్రణాళిక, మౌలిక వసతులు తమను ఆకట్టుకున్నాయని తెలిపారు. అనంతరం ప్రతినిధులు శ్రీసిటీ పరిసరాలతో పాటు హావెల్స్, వరుణ్ బెవరేజెస్ (పెప్సికో) పరిశ్రమలను సందర్శించి వాటి కార్యకలాపాలను పరిశీలించారు.

## కథలతో సుస్థిరాభివృద్ధి సందేశం.. 'కథోత్సవ్--2026'లో విద్యార్థుల ప్రతిభ



**తిరుపతి, సెప్టెంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి):** కరకంబాడిలోని అమర రాజా ఆడిటోరియంలో అమర రాజా విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర పాఠశాలల ఇంగ్లీష్ కథల పోటీ 'కథోత్సవ్--2026' ఘనంగా జరిగింది. 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు' ప్రధాన ఇతివృత్తంగా సాగిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 17 ప్రముఖ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కథా చెప్పే నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ ప్రొఫెసర్ డాక్టర్ పి. హరి పద్మ రాణి, అమర రాజా గ్రూప్ చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ ప్రశాంత్ తివారి, అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా, న్యాయ నిర్ణేతలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కథలు చెప్పడం విద్యార్థుల్లో సృజనాత్మకత, ఊహాశక్తి, ఆత్మవిశ్వాసం, భావవ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందిస్తుందని అన్నారు. సుస్థిరాభివృద్ధి వంటి కీలక అంశాలను కథల రూపంలో విద్యార్థులు సృజనాత్మకంగా ప్రదర్శించడం అభినందనీయమని ప్రశంసించారు. పోటీల్లో దిగువమాఘం అమర రాజా విద్యాలయం విద్యార్థిని బి. వైష్ణవి ప్రథమ బహుమతి సాధించగా, కరకంబాడి అమర రాజా విద్యాలయం విద్యార్థిని సి. దేవసు వర్షిణి ద్వితీయ బహుమతి, శ్రీసాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని సి. ఝాన్సీ తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గ్లోరి దేవ ప్రియ, వైస్ ప్రిన్సిపాల్ పూజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చెకుముకి పరీక్షల్లో లుంబిని విద్యార్థుల ప్రతిభ

**మండల స్థాయి నుండి జిల్లా స్థాయికి ఎంపికైన లుంబిని విద్యార్థులు**





**చేజర్ల సెప్టెంబర్ 11 (వార్తాప్రభ)** మండల స్థాయిలో జరిగిన చెకుముకి ప్రతిభా పరీక్షలో లుంబిని విద్యా ర్థులు అద్భుతమైన ప్రతిభ కనబ రచారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల యాజ మాన్యం మాట్లాడు తూ గతంలో కూడా ఎన్నో ప్రతిభా పరీక్షలలో మా విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉపాధ్యా యులు ఇచ్చిన సూచ నలు సలహాలు మేరకు సాధన చేస్తూ అక్షర జ్ఞానాన్ని పెం పొందించుకొని పోటీ పరీక్షలలో గణనీయమైన ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారని అదేవిధంగా ఈ సంవత్సరం జరిగిన మండల స్థాయి చెకుముకి పోటీ పరీక్షలలో మండల స్థాయి నుండి జిల్లా స్థాయికి మా విద్యార్థులు ఎంపికవ్వడం మాకు మా పాఠశాలకు ఎంతో గర్వకారణం అని హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఈ సందర్భంగా షేక్. మిస్రాణ (8వ తరగతి )పి. లక్ష్మీ ప్రసన్న (9వ తరగతి )పి. జితేంద్ర (10వ తరగతి)ఇంతటి ప్రతిభను కనబరచిన మా విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం తరఫున మరియు ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు.

## ఆదిత్య నర్సింగ్ విద్యార్థినులకు జర్మన్ లో 42 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం



**కాకినాడ, సెప్టెంబర్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ 2020-2024విద్యా సంవత్సరంలో బి.ఎ.స్సీ నర్సింగ్ విద్యనభ్యసించిన కాకి నమిత, కొర్రా శ్రీ మాధురి అనే విద్యార్థినులు జర్మన్ లాంగ్వేజిలో శిక్షణ పొంది అర్హత సాధించి, జర్మన్ దేశంలో స్టాఫ్ నర్సులుగా సంవత్సరానికి 42 లక్షల ప్యాకేజి ఉద్యోగాలు పొందారు. ఆదిత్య విద్యాసంస్థల నాణ్యమైన విద్యాప్రమాణాలకు ఇది ఒక తార్కాణంగా విద్యార్థినుల యొక్క తల్లి దండ్రులు పేర్కొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డా. నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టరు డా. నల్లమిల్లి సుగుణా రెడ్డి, ఆదిత్య నర్సింగ్ కాలేజి ప్రిన్సిపల్ ఎన్. సంధ్యారాణి తమ విద్యార్థినుల యొక్క ప్రతిభను ప్రశంసించి, వారిని అభినందించడం జరిగింది. విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికి తీయుటంలో ఆదిత్య విద్యాసంస్థలు ముందుంటాయని, నాణ్యమై న విద్యా ప్రమాణాలు, సదుపాయాలు తాము పాటిస్తామని అవి విద్యార్థుల ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడతాయని, ఆదిత్య నర్సింగ్ కాలేజి ప్రిన్సిపల్ పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్, అధ్యాపక బృందం విద్యార్థులను ప్రశంసించడం జరిగింది.

## జనసేన పార్టీలో ప్రజలకు సేవా చేసే వారికే ప్రాధాన్యత

**ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 11 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ కండ్రిక జర్నలిస్ట్ కాలనీలో వైసిపి సీనియర్ నాయకుడు పందిరి వాసు జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, పెనుగొండ సుబ్బారాయుడు సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. పందిరి వాసు కు జనసేన పార్టీ కండువా ను వేసి పార్టీలోకి సాగరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సామినేని ఉదయభాను మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి అనేకమంది కూటమి పార్టీలలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు జనసేన పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని కార్పొరేషన్ ఎన్నికలతో పాటు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని ఆయన పేర్కొన్నారు వైసీపీకి చెందిన పందిరి వాసు జనసేన పార్టీలోకి రావడానికి స్వాగతిస్తున్నట్లు తెలియజేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి గెలుపే లక్ష్యం పనిచేస్తామని జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పేర్కొన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు పెనుగొండ సుబ్బారాయుడు, బాడిత శంకర్ రానున్న కార్పొరేషన్ ఎన్నికలలో జనసేన పార్టీ శ్రేణులు కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రతీ కార్యకర్త నడుచుకోవాలని ఆయన సూచించారు. జనసేన పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తుందని రానున్న మున్సిపల్ ఎన్నికలలో స్థానిక సంస్థల ఎన్నికలలో నామినేటెడ్ పదవులలో అత్యంత ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జనసేన పార్టీలో నూతనంగా చేరిన పందిరి వాసు మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల కూటమిపాలనలో రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు వచ్చి తాను వైసిపి నుంచి జనసేన పార్టీలోకి చేరినట్లు తెలియజేశారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ గెలుపే లక్ష్యంగా తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు..

## కామాక్షి అమ్మవారికి 108 కిలోల కుంకుమార్చన



గుడివాడ,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) : పట్టణ పరిధిలోని బేతబోలు రైల్వే గేటు వద్ద వేంచేసి ఉన్న ఘన కంచి కామాక్షి అమ్మవార్కి పద్మావతి భజన మండలి మరియు అయోధ్య రామ భజన మండలి వారు సంయుక్తంగా నిర్వహించిన కుంకుమార్చనకు సుమారుగా 300 మంది మహిళలతో వేణుగోపాలస్వామి ఆలయ వద్ద నుంచి కంచి కామాక్షి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా విచ్చేసి లలిత సహస్రనామంతో మారుమోగింది. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ చైర్మన్లు గా నూకల లక్ష్మి శివ జ్యోతి బోయిన రాధా లక్ష్మీ రాజ్యం సునీత సుంకుల సత్య తులసి దుర్గమ్మ పర్యవేక్షణలో అత్యంత వైభవంగా నిర్వహించారు. 108 కేజీల కుంకుమను కటకం మహాలక్ష్మి దంపతులు సమర్పించారు. తదనంతరం తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నూకల లక్ష్మి శివ జ్యోతి మాట్లాడుతూ సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## బిఎస్ఎన్ జూనియర్ కాలేజీలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ






గుడివాడ,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) : పట్టణంలోని గౌరీశంకర్ పురంలో ఉన్న బిఎస్ఎన్ జూనియర్ కాలేజీలో ఫ్రెషర్స్ పార్టీని కళాశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనడంతో ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. 2002 నుంచి నేటి వరకు విద్యారంగంలో దిగ్విజయంగా ముందుకు సాగుతున్న బిఎస్ఎన్ కాలేజీ యాజమాన్యాన్ని విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డైరెక్టర్ బెండి సత్యనారాయణ, సెక్రటరీ కరస్పాండెంట్ కనకమహాలక్ష్మిల ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి భవిష్యత్తుకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నారని వారు ప్రశంసించారు. ఫ్రెషర్స్ పార్టీ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కార్యక్రమం ఆహ్లాదకరంగా, ఉత్సాహభరితంగా సాగింది.

## వాసవి జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టేషనరీ ఐటమ్స్ పంపిణీ..



గుడివాడ,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) : వాసవి జాగృతి క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో కాకర్ల వీధి ఓల్డ్ టౌన్ నెంబర్ 2 స్కూల్ నందు చిట్టూరి శ్రీనివాసరావు కామేశ్వరి దంపతుల సహకారంతో 50 మందికి నోట్ బుక్స్ పెన్సిల్ బిస్కెట్ ప్యాకెట్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దాత చిట్టూరి శ్రీనివాసరావు పాల్గొని వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శేగు వెంకటప్రసాద్ మాట్లాడుతూ తాను చేస్తున్న కార్యక్రమాల్లో ఈరోజు 200 సేవా కార్యక్రమాన్ని పురస్కరించుకొని చిట్టూరి శ్రీనివాసరావు దంపతులు స్కూల్లో బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శేగు బలిత మరియు డిస్టిక్ కో ఆర్డినేటర్ గాదె మోహన్ బాబు, క్లబ్ కార్యదర్శి కంతేటి హరినాథ్ బాబు, స్కూల్ హెచ్ఎం డేనియల్, 5వ క్లాస్ టీచర్ యోహోషువా తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన




గుడివాడ,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) : వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఎంపిక చేసిన ప్రదేశాల్లో చేపట్టిన ఏర్పాట్లను గుడివాడ పురపాలక సంఘం కమీషనర్ ఎస్. మనోహర్ పరిశీలించారు. ఈ సందర్భంగా దొండపాడు కాలువ సెంటర్, పెద్దకాలువ సెంటర్ వద్ద నిమజ్జనానికి సంబంధించి పారిశుద్ధ్యం, భద్రత, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు తదితర ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు షిఫ్టుల వారీగా సిబ్బందికి విధులు కేటాయించడం జరిగింది. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని కమీషనర్ సూచించారు. అలాగే ప్రజలందరూ పర్యావరణహిత విధానంలో వినాయక చవితి పండుగను జరుపుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమీషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ సతీష్ చంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివాజీ, అసిస్టెంట్ ఇంజనీర్లు రాజేష్, శివాజీ, శానిటరీ ఇన్స్పెక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు గుర్రాల ఎన్నికకు కమిటీ సమావేశం



విస్సన్నపేట,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) : స్థానిక మండలంలో ఎంపీపీ జడ్పిటిసి గ్రామ సర్పంచ్ వార్డు మెంబర్లు ఎంపీటీసీలు ఆశావాహుల జాబితాను తయారు చేసేందుకు బడా రాజకీయ 9 మంది సభ్యులతో కమిటీ వేస్తున్నట్లు విశ్వసనియవర్గాల సమాచారం అందుతుంది. ఎంపీపీ రిజర్వేషన్ ఓసి అవుతుందని అదేవిధంగా జడ్పిటిసి ఎస్సి వీటితోపాటు విస్సన్నపేట గ్రామపంచాయతీ బీసీ మహిళ రిజర్వేషన్ కానున్నదని ఊహాగానాలు సోషల్ మీడియాలో షికారులు చేయడంతో ఆశావహులు ప్రధాన రాజకీయ నాయకుల గృహాలకు ఉదయం సాయంత్రం గుడ్ మార్నింగ్ గుడ్ ఈవెనింగ్ రాత్రిపూట గుడ్ నైట్ లు చెబుతున్నట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికలలో టిడిపి పార్టీ విజయభేరి మోగించడంతో అదే జోష్ తో తెలుగు తమ్ముళ్లు ఉర్రూతలు ఊగుతున్నట్టు పలువురు అనుకుంటున్నారు. పోల్ మేనేజ్మెంట్ లో అపార అనుభవం కలిగిన రాజకీయ చాణక్యులు గ్రామాల వారీగా వచ్చే రిజర్వేషన్ ను బట్టి ఏ వ్యక్తి ఎక్కడ పోటీ చేస్తే గెలుస్తారనేది ముందస్తు అంచనాలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

## సచివాలయాల్లో పర్యటించి పెన్షన్ దరఖాస్తుదారులకు సహాయం చేయండి..

### ● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధ్యక్షతన గుడివాడ నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశం.. నూతన పెన్షన్ల దరఖాస్తుల సమయంలో వస్తున్న ఇబ్బందులపై చర్చ..



గుడివాడ,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) : ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. స్థానిక ప్రజావేదిక కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఆయన అధ్యక్షతన గుడివాడ నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పెన్షన్ల దరఖాస్తుల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, సచివాలయాల పరిధిలో ప్రజలకు తలెత్తుతున్న సమస్యలను మండలాల వారీగా నాయకులు ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ కూటమి నాయకులు, కార్యకర్తలు కూడా ప్రభుత్వానికి అనుసంధానంగా క్షేత్రస్థాయిలో పనిచేసి ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. నేడు సమావేశంలో తీసుకొచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. నాయకులు సచివాలయాల పరిధిలో పర్యటిస్తూ నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే వారికి అవసరమైన సహాయాన్ని అందించాలని రాము కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం కూడా పార్టీ శ్రేణుల బాధ్యతేనన్నారు. మనం 90% ప్రజల సమస్యలను పరిష్కరించగలుగుతున్నామని, కానీ మిగిలిన 10% సమస్యల పరిష్కారం కోసం మనం చేసిన కృషిని వారికి వివరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూసీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. అలాగే గుడివాడ పట్టణంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక మార్పులు తీసుకొచ్చామని, గతంలో ట్యాంకర్లపై ఆధారపడిన పరిస్థితిని అధిగమించి ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టామని రావి తెలిపారు. గత పాలనలో అభివృద్ధి కంటే రాజకీయాలకు ప్రాధాన్యత ఇవ్వరని, ప్రజలను వర్గాలుగా విభజిస్తూ రాజకీయ ప్రయోజనాలను పొందే ప్రయత్నాలు జరిగాయని రావి విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని రావి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, గుడివాడ, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల టిడిపి అధ్యక్షులు పండ్రాజు సాంబశివరావు, వాసే మురళి,దానేటి సన్యాసిరావు, పోలవరపు వెంకట్రావు, కార్పొరేషన్ డైరెక్టర్లు దింట్యాల రాంబాబు, మజ్జాడ నాగరాజు, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహనరావు, లింగం ప్రసాద్, క్లస్టర్ ఇన్చార్జులు తాతినేని మురళి, ఉప్పల వెంకటేశ్వరరావు, మాదాల సురేష్, పంచమర్తి శ్రీనివాసరావు, సూరు కాశి, సయ్యద్ జబిన్, తోకల క్రాంతి, వీరవరపు వంశీ, కొడాలి రామరాజు, వల్లభనేని సుబ్బారావు, యూనిట్, బూత్, ఇన్చార్జులు, వార్డు, గ్రామ పార్టీల అధ్యక్ష కార్యదర్శులు, గుడివాడ నియోజకవర్గ టిడిపి ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

## ఎన్‌డీఏ, ఎన్ఏ, సీడీఎస్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### ● పరీక్షల విజయవంతానికి పటిష్ట సమన్వయం ● డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం




విజయవాడ,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) : ఈ నెల 13వ తేదీన జరిగే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), నేవల్ అకాడమీ; కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) ఎం.లక్ష్మీనరసింహం తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో డీఆర్‌వో లక్ష్మీనరసింహం.. యూపీఎస్సీ అబ్జర్వర్ భాను జోషితో కలిసి లైజన్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్వైజర్లు, సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఈ నెల13వ తేదీ ఆదివారం విజయవాడలోని అయిదు కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. సీడీఎస్‌కు 691 మంది, ఎన్‌డీఏ అండ్ ఎన్ఏకు 1,019 మంది మొత్తం 1,710 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సీడీఎస్‌కు సంబంధించి ఉదయం 9 గం. నుంచి 11 గం. వరకు సెషన్–1, మధ్యాహ్నం 12.30 గం. నుంచి 2.30 గం. వరకు సెషన్–2, సాయంత్రం 4 గం. నుంచి 6 గం. వరకు సెషన్–3 జరగనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్‌డీఏ అండ్ ఎన్ఏకు సంబంధించి సెషన్–1 ఉదయం 10 గం. నుంచి మధ్యాహ్నం 12.30 గం. వరకు సెషన్–2 మధ్యాహ్నం 2 గం. నుంచి సాయంత్రం 4.30 గం. వరకు జరుగుతుందని వివరించారు. భద్రతకు సంబంధించి పోలీసు శాఖ ఏర్పాట్లు చేయాలని.. అదేవిధంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని.. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, రవాణా సౌకర్యంతో పాటు తాగునీరు, ఇతర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని డీఆర్‌వో లక్ష్మీనరసింహం, సమన్వయ శాఖల అధికారులకు సూచించారు.

## వేళలు పాటించని సచివాలయ సిబ్బంది

### ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● పింఛన్ల దరఖాస్తు చేసుకునేందుకు వృద్ధుల ఎదురుచూపు



మంగళగిరి,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) : గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది సకాలంలో హాజరు కాకపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన వేళలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాలు తెరిచి ఉండాలి. కానీ మంగళగిరి నియోజకవర్గంలోని పలు సచివాలయాల్లో ఉద్యోగులు 10:30, 11 గంటలకు వస్తున్నారని, మధ్యాహ్నమే వెళ్లిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. శుక్రవారం నగరం లోని మార్కండేయ కాలనీ లోని 17 వ నంబర్ సచివాలయం సిబ్బంది ఉదయం 10:45 కు కూడా కార్యాలయానికి రాకపోవడంతో ప్రజలు సచివాలయం ఎదుటే పడిగాపులు కాస్తున్నారు. రేషన్ కార్డు, ఆధార్, పెన్షన్ పనుల కోసం వచ్చే వృద్ధులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. 17 వ సచివాలయం తలుపులు మూసి ఉండటంతో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వృద్ధులు కార్యాలయం ఎదుట అధికారుల రాక కోసం వేచి చూస్తున్నారు ఆయా సచివాలయాల్లో కొంతమంది సిబ్బంది ప్రతిరోజు హాజరు రిజిస్టర్ లో సంతకం పెట్టి బయటకు వెళ్లిపోతున్నారని, బయోమెట్రిక్ తప్పనిసరి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, ఆకస్మిక తనిఖీలు చేపట్టి, వేళలు పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.సచివాలయ వ్యవస్థ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల అప్రతిష్ట పాలవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సమస్య పరిష్కారం కోరిన వారిపై పోలీసుల దాడి అమానుషం: సిపిఎం






గన్నవరం,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) : గన్నవరం విమానాశ్రయ విస్తరణ నిర్వాసితులపై పోలీసుల దాడి తీవ్ర అమానుషమని, బాధితుల న్యాయమైన పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని సీపీఎం కృష్ణా జిల్లా కమిటీ ప్రకటించింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు ఒక ప్రకటన విడుదల చేశారు. ?విమానాశ్రయం కోసం దావాజీగూడెం, బుద్దవరం, అజ్జంపుడి, కేసరపల్లి గ్రామాల్లో ఇళ్లు కోల్పోయిన 400 దళిత, పేద కుటుంబాలకు 2013 పునరావాస చట్టం ప్రకారం ప్లాట్లతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ.9 లక్షల నష్టపరిహారం అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. దాదాపు 13 ఏళ్లు గడుస్తున్నా పరిహారం చెల్లించకపోవడంతో బాధితులు అద్దె ఇళ్లల్లో ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతోనే బాధితులు విమానాశ్రయ గేటు వద్ద శాంతియుతంగా ధర్నా చేపట్టినట్లు తెలిపారు. ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న నిర్వాసితులు, మహిళలపై పోలీసులు పాశవికంగా దాడి చేసి, ఈడ్చుకెళ్లి అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నిర్వాసితుల పట్ల దురుసుగా వ్యవహరించిన పోలీసు అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి కుటుంబానికి రూ.9 లక్షల పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఏ.కొండూరులో కిడ్నీ వ్యాధులపై అవగాహన తప్పనిసరి

### ● అధికారులను నిలదీసిన ఆర్టీవో ఏ.కుమార్




తిరువూరు,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) : తిరువూరు నియోజకవర్గంలోని ఏ.కొండూరు మండల సర్వసభ సమావేశంలో కిడ్నీ వ్యాధుల సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా చర్చించారు. మండలంలో కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య, మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆర్టీవో ఏ.కుమార్ ప్రశ్నలు సంధించారు. కిడ్నీ వ్యాధులపై గ్రామీణ ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తున్నారా? వ్యాధి బారిన పడుతున్న వారికి అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయా? అంటూ అధికారులను నిలదీశారు. డయాలసిస్ కేంద్రాల్లో కిడ్నీ బాధితులకు అవసరమైన మందులు, ఇతర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు పరిశీలించాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామంలో కిడ్నీ వ్యాధులపై తప్పనిసరిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం నుంచి చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

**ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు..** కృష్ణా జలాలను శుద్ధి చేసి ప్రతి ఇంటికీ మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను అధికారులు ఆదేశించారు. తాగునీటి నాణ్యతపై ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి, ప్రజలకు సురక్షితమైన నీరు అందేలా చూడాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ఆర్ఎంపీ డాక్టర్లు కిడ్నీ బాధితులకు వైద్యం అందించరాదు ఎవరైనా అలా వైద్యం అందిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు కిడ్నీ వ్యాధుల నియంత్రణకు వైద్య, పంచాయతీ, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు.

## విద్యావికాస్‌లో భక్తిశ్రద్ధలతో వినాయక పూజ

### ● మట్టి వినాయకులతో చిన్నారుల సందడి.. ఆకట్టుకున్న బ్లూమ్స్ చిన్నారుల నృత్యాలు..




గుడివాడ,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) : వినాయక చవితి సందర్భంగా వరుసగా మూడు రోజుల సెలవులు రానున్న నేపథ్యంలో, విద్యావికాస్ బ్లూమ్స్, ప్రైమరీ మరియు హైస్కూల్ విద్యార్థులతో శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో వినాయక పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు, ప్రైమరీ హెడ్మాస్టర్ పి.డి. ఆశీర్వాదం, బ్లూమ్స్ ఇన్‌చార్జ్ చింతలూరి ఉమాదేవి గణపతి పూజ నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. చిన్నారులు తమ చేతులతో మట్టి వినాయక ప్రతిమలను తయారుచేసి తీసుకురావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వినాయకుని స్తుతిస్తూ విద్యావికాస్ బ్లూమ్స్ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు మాట్లాడుతూ, విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహనను చిన్నతనం నుంచే విద్యార్థుల్లో పెంపొందించడం విద్యావికాస్ లక్ష్యమని తెలిపారు. వినాయకుని ఆశీస్సులతో విద్యార్థులందరూ విద్యలో రాణించి, మంచి విలువలతో ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు కూడా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని వినాయక పూజను విజయవంతం చేశారు.

## యువత నాయకత్వంతోనే సుస్థిర భవిష్యత్తు..






విజయవాడ/హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) : యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవలపై అవగాహన కల్పించడం ద్వారా సుస్థిర భవిష్యత్తును నిర్మించవచ్చని పంచకర్ల చక్రవర్తి అన్నారు. వీఐటీ విశ్వవిద్యాలయంలోని టంగుటూరి ప్రకాశం ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన వీవైఎల్‌డీ (ఎదీూణ) కార్యక్రమంలో ఆయన ప్యానెల్ సభ్యుడిగా పాల్గొన్నారు. వీఐటీ, విజ్ఞాన్ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవ, యువత నాయకత్వం తదితర అంశాలపై తన అభిప్రాయాలను, వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. జోన్–01, లయన్స్ క్లబ్ 316డీ (2026––27) జోన్ చైర్మన్‌గా, టాంజ్యో గ్రూప్ సీఎండీగా, గ్రీన్‌మానోస్ ఫౌండేషన్ చైర్మన్‌గా నిర్వహిస్తున్న బాధ్యతలను వివరించారు. విద్యార్థుల్లో కనిపించిన ఉత్సాహం, సామాజిక బాధ్యత పట్ల వారి నిబద్ధత తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని, పర్యావరణ పరిరక్షణతో పాటు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువతలో నాయకత్వ స్ఫూర్తి పెంపొందితే పర్యావరణహిత, సేవాభావంతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

## కొమ్మారెడ్డి స్కూల్ లో ఘనంగా వినాయకచవితి వేడుక...



కృత్తివెన్ను,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) : స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు శుక్రవారం వినాయక చవితి వేడుకను ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ పి. వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ విద్యార్థులచే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పండ్లు, పత్రి, పువ్వులతో ఉండ్రాళ్ళు, పాలతాలికలు, పులిహోర. శనగలు, క్షీరాన్నం చక్రపొంగలి రవ్వకేసరి, బొబ్బట్లు మొదలైన మన తెలుగింటి ఫలహారాలు తీసుకుని వచ్చి వినాయకుని పూజించారు. మట్టి వినాయకుని పూజిద్దాం -- పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో మట్టి వినాయక విగ్రహాలు చేయమని విద్యార్థులను ప్రోత్సహించడం జరిగింది. తమ చిట్టి చిట్టి చేతులతో దాదాపు 50 మంది చిన్నారులు మట్టి, వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పిండి పదార్థాల తో చేసిన వినాయక విగ్రహాల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. అలాగే శివుడు, పార్వతి, వినాయకుడు, కుమారస్వామి వేషాలు ధరించి చిన్నారులు అందరిని అలరించారు. కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు విధిగా మట్టి వినాయకుని పూజించాలని, యువత అత్యంత ఉత్సాహంగా వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్నాగాని నిమర్జన సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వినాయకుడు మంచి బుద్ధికి, తెలివితేటలకు ప్రతిరూపమని, విద్యార్థులు ప్రతి పండుగ అంతర్యాన్ని గ్రహించాలని, మన సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకోవాలని చెప్పారు. చిన్నప్పటి నుండే పర్యావరణం పట్ల అవగాహన కల్పించాలని, తల్లిదండ్రుల పట్ల అత్యంత శ్రద్ధాభక్తులు కలిగి ఉండి విజయాలు సాధించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. అందరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియచేశారు. తెలుగు ఉపాధ్యాయులు వి. సాంబశివరాజు వినాయక చవితి విశిష్టతను అందరికి తెలియజేశారు. ఈ కార్యక్రమం ప్రీ- ప్రైమరీ ఇంచార్జ్ పి. వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరణి , స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసరావు , పి .ఈ .టి కె. శ్రీనివాస రావు , తెలుగు ఉపాధ్యాయులు వి. సాంబశివరాజు , ఎల్ కె జి నుండి 2 వ తరగతి వరకు గల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు......

# లంక నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు





**జి.కొండూరు,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** జి.కొండూరు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి లంక నాగేశ్వరరావు (నాని) తండ్రి లంకా కోటేశ్వరరావు (84) ఇటీవల వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు.మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం కుంటముక్కల గ్రామంలోని లంక నాగేశ్వరరావు స్వగృహానికి వెళ్లి నాగేశ్వరరావు ను ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు లంక కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.నాగేశ్వరరావు ఆయన కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడి వారికి మనోధైర్యం కల్పించారు.ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు వెంట మండల పార్టీ అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వుయ్యూరు వెంకట నరసింహారావు, కుంటముక్కల పిఎసిఎస్ చైర్మన్ సుఖవాసి శ్రీహరి, మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి లంక రామకృష్ణ వరప్రసాద్ స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు,కూటమి నాయకులు తదితరులు ఉన్నారు.

# మెగా జాబ్ మేళా లో 63 మంది అభ్యర్థులు ఎంపిక







**మైలవరంసెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ (JKC), మరియు 'వికాస' (VIKASA) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు ?వివిధ ప్రాంతాల నుంచి సుమారు 127 మంది అభ్యర్థులు హాజరు కాగా వీరిలో 63 వివిధ కంపెనీలకు ఎంపిక అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాధవి తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు,నిరుద్యోగ యువత కు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు కళాశాల దశ నుంచే నైపుణ్యాలను పెంపొందించుకుని ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.?

**ప్రతిభావంతులైన యువతకు ప్రముఖ ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు:** వికాస ప్రతినిధి అరవింద్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన యువతకు ప్రముఖ ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వికాస నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అలాగే వైస్ ప్రిన్సిపాల్ అబు భాకర్ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.? జేకేసీ కోఆర్డినేటర్ డా.షేక్. కరీమ-ుల్లా మాట్లాడుతూ కళాశాల విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు జేకేసీ ద్వారా శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశా లు కల్పిస్తున్నామని తెలిపారు.?ఎంపికైన అభ్యర్థు లకు కళాశాల ప్రిన్సిపాల్,వికాస ప్రతినిధులు మరియు అధ్యాపక బృందం అభినందనలు తెలిపి ఉద్యోగ ఎంపిక పత్రాలను అందజేశారు.

# యువత మత్తు పదార్థాల పట్ల జాగ్రత్తగా ఉండాలి..

- మత్తు పదార్థాలు యువతనే కాక వారి కుటుంబాన్ని ఇబ్బందుల్లోకి నెట్టివేస్తుంది
- బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్.కె నజ్మా పిలుపు





**విజయవాడ,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో విజయవాడ గుణదల ఏరియా లో వున్నా సెయింట్ జోసెఫ్ ఐ.టి. ఐ కాలేజీలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సుని శుక్రవారం స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్ కె .నజ్మా మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవడం కేవలం మీ భవిష్యత్తు ను మాత్రమే కాదు, మీ కుటుంబ సభ్యుల భవిష్యత్తును కుడా ప్రమాదం లోకి నెట్టుతుంది. మత్తుపదార్థాలైన ఆల్కహాల్, పొగాకు, గంజాయి లాంటివాటి వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా యువత వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు, మొదట్లో సరదాగా తీసుకునే మత్తపదార్థాలు క్రమేపీ నియంత్రణ కోల్పోయి మత్తుకు బానిసలు అవుతారనిన్నారు అని, చెడు అలవాట్లు అనేవి ఒకరు నుంచి ఒకరు అలవాటు పడి తీవ్ర ప్రమాదస్థాయికి చేరుకుంటరని, క్యాన్సర్, మరియు ఇతర ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని స్నేహితులు కానీ మరి ఏ ఇతర వ్యక్తులు కానీ మాదక ద్రవ్యాలపై ప్రలోభపెడితే కచ్చితంగా వద్దు అని చెప్పాలని, మత్తు పధార్థాలతో బ్రతుకు దుర్భరం చేసుకోవద్దు అని, మత్తుపదార్థాల వలన ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతామని తెలిపారు. సరి అయిన అవగాహన లేక మాదకద్రవ్యాలకు బానిసలవుతున్న వారు ఎక్కువ మంది వున్నారని, ముందుగానే సరి అయిన అవగాహన పెంచుకొని జీవితాలను చక్క దిద్దికోవాలని, అన్నారు. విద్యార్థి దశలో విద్యార్థులు ఒక్కసారి ధూమపానం, మద్యం సేవించడం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కృంగిపోవడం జరుగుతుందనిన్నారు. అది నేర ప్రవృత్తివైపు కూడా ప్రేరేపిస్తుందని అని అన్నారు , ఈ అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు, అనంతరం నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ డి.వెంకటేశ్వరావు ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను మరియు యువత ను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావచ్చు అని ఈ చికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ సంస్థ వారు నూజివీడు లో బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసింది అని ఈ లాంటి సమస్యల తో ఉన్నవిద్యార్థులకు మరియు యువతకు నూజివీడు మండలం పొలసానపల్లి లో ఏర్పాటు చేసిన " బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని" ఉచితంగా సంప్రదించవచ్చు అని సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490492020 అని అన్నారు అనంతరం కరెస్పాండంట్ కె .జోసెఫ్ మరియు ప్రధానోపాధ్యాయులు వి .సరేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వలన విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందని, ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నవజీవన్ బాల భవన్ వారికీ కృతజ్ఞతలు తెలియజేసారు ఈ కార్యక్రమములో, కాలేజీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల గడపకు పాలన సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రత్యేక స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- అధికార యంత్రాంగంతో కలిసి ప్రజల సమస్యలను విన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నందిగామ,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** ప్రజలకు పాలనను మరింత చేరువ చేసి, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని మధిర ఆర్చి రోడ్డులో ఉన్న ఆర్ఎస్ గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రత్యేక స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలేఖ్య గారు, జిల్లా అధికార యంత్రాంగం, కూటమి నేతలతో కలిసి ప్రజల నుంచి సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులతో చర్చించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రజా వేదికలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఎమ్మెల్యే సౌమ్య గారు పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలు పరిష్కారం కాకుండా కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగే పరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల వద్దకే పాలన.. ప్రజల సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం అనే విధానంతో ముందుకు సాగుతోందని ఆమె తెలిపారు. నందిగామ నియోజకవర్గంలోని పట్టణ గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికార యంత్రాంగంతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నామని వెల్లడించారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి,



నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే సౌమ్య సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అందేలా చూడాలని అధికారులను కోరారు.కూటమి ప్రభుత్వంలో ప్రజల సమస్యలకు ప్రాధాన్యత.. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు పెద్దపీట వేస్తూ నందిగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తంగిరాల సౌమ్య తెలిపారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో.....
# అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ గడువు ముగిసింది

- అక్టోబరు 5 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం
- అక్టోబరు 9న తుది ఓటర్ల జాబితా ప్రచురణ
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.లక్ష్మీశ



**విజయవాడ,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** జిల్లాలో భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నిర్ణయించిన గడువు గురువారం అర్ధరాత్రితో (10.09.2026) ముగిసిందని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా.జి.లక్ష్మీశ తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించడంతో పాటు, మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, బదిలీ అయిన వారు, ఇతర కారణాల వల్ల అనర్హులైన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించే చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఫారం-6 కింద మొత్తం 40,802 దరఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. వీటిలో ఇప్పటికే 27,224 దరఖాస్తులను పరిష్కరించినట్లు వెల్లడించారు. మిగిలిన దరఖాస్తులను కూడా ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్న దరఖాస్తుదారులకు ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరణించిన, బదిలీ అయిన, శాశ్వతంగా వలస వెళ్లిన లేదా ఇతర కారణాల వల్ల అనర్హులైన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ఫారం-7 కింద మొత్తం 21,023 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం మాత్రమే తగిన నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఓటర్ల నివాస మార్పులు, ఓటరు గుర్తింపు కార్డు రీప్లేస్‌మెంట్, ఓటరు జాబితాలోని వివరాల సవరణలు, ఇతర మార్పుల నమోదు కోసం ఫారం-8 కింద 44,638 దరఖాస్తులు అందినట్లు డా.జి.లక్ష్మీశ తెలిపారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు సక్రమంగా ఉండేలా, ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉండకుండా, ఓటర్ల జాబితా నాణ్యతను మెరుగుపరిచే దిశగా ఈ దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు ముందు అందిన దరఖాస్తులతో కలిపి ప్రస్తుతం ఫారం-6కు సంబంధించిన 10,330 దరఖాస్తులు, ఫారం-7కు సంబంధించిన 982 దరఖాస్తులు, ఫారం-8కు సంబంధించిన 7,447 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ దరఖాస్తులను నిర్ణీత నిబంధనల ప్రకారం పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఆయన వివరించారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై స్వీకరించిన అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించే ప్రక్రియ అక్టోబరు 5, 2026 వరకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితాలో అర్హత కలిగిన ఏ ఒక్కరి పేరు కూడా అన్యాయంగా తొలగించబడకుండా, అదే సమయంలో అనర్హుల పేర్లు జాబితాలో కొనసాగకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్యుమరేషన్ పత్రాలలో లోపాలు ఉన్నట్లు గుర్తించిన 1,94,681 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నోటీసులు అందుకున్న వారిలో ఇప్పటికే 1,83,300 మంది ఓటర్లకు సంబంధించిన విచారణ ప్రక్రియ పూర్తయిందని ఆయన వెల్లడించారు. సంబంధిత ఓటర్లు సమర్పించిన పత్రాలు, వివరాలను అధికారులు పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్యుమరేషన్ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్లలో, అవసరమైన సరైన పత్రాలు సమర్పించకపోవడం మరియు నిబంధనలకు అనుగుణంగా అర్హతను నిరూపించుకోలేకపోవడం వంటి కారణాలతో 6,280 మందిని అనర్హులుగా తేల్చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అయితే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి కేసును నిబంధనల మేరకు పరిశీలించిన తరువాత మాత్రమే తుది నిర్ణయం తీసుకుంటున్నామని, అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిశీలన, ఎన్యుమరేషన్ పత్రాల పరిశీలన తదితర ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం 2026 అక్టోబరు 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రజలందరూ సహకరించాలని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు తన పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానంలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఓటర్ల జాబితాను పారదర్శకంగా మరియు తప్పులులేకుండా రూపొందించడం ఎన్నికల యంత్రాంగం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ స్పష్టం చేశారు.

# మట్టి గణపతులు వాడండి పర్యావరణాని కాపాడండి - హెచ్.ఎం.నక్కబాబురావు....



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి భంగం కలగని విధంగా మట్టి గణపతులు వాడటం మంచిది అని పెనుగంచిప్రోలు బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం నక్కా బాబురావు అన్నారు. శుక్రవారం నాడు బాలికల హైస్కూల్లో ఉపాధ్యాయులు పిల్లలతో మృత్తి కా గణపతులను తయారు చేయించారు. ప్రత్యేకంగా చెరువు మట్టిని తెప్పించి వివిధ ఆకారాల్లో గణపతులను చేయించడమే కాక, వినాయక చవితి లో వాడే పత్రి యొక్క ఆరోగ్య విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముక్కా సత్యనారాయణ, వేగినేటి వెంకటరమణ, నల్లూరి పద్మ, ప్రమీల, స్వర్ణలత, స్వాతి శిల్ప,ఉష, సంతోష భారతి,సైరాభాను, శ్రీదేవి, జి వెంకటేశ్వరరావు , జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు...

# ఆకలితో ఉన్న వృద్ధుల ఇళ్లకు ప్రతిరోజూ భోజనం

- తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వాణి విద్యానికేతన్ అధినేత నందిగం రవికుమార్ సేవాయజ్ఞం






**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** సమాజంలో ఎంతోమంది సంపాదిస్తారు.. కానీ సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని ఆపన్నులకు అందించి మానవత్వాన్ని చాటుకునేవారు కొందరే. అలాంటి సేవాభావం కలిగిన వ్యక్తిగా బాపులపాడు మండలం వీరవల్లి గ్రామానికి చెందిన వాణి విద్యానికేతన్ అధినేత నందిగం రవికుమార్ నిలుస్తున్నారు. తన తల్లిదండ్రులు కీర్తిశేషులు నందిగం బాలస్వామి, సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం నందిగం బాలస్వామి--సీతామహాలక్ష్మి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసిన రవికుమార్.. ఆ ట్రస్ట్ ద్వారా కొంతకాలంగా నిరంతరాయంగా అన్నదాన సేవను కొనసాగిస్తున్నారు. ప్రతిరోజూ తన ఇంటి వద్దే స్వయంగా వంట చేయించి, భోజనాన్ని క్యారేజీల్లో సర్ది వీరవల్లి, అంపాపురం గ్రామాల్లో వయసు మీదపడి వంట చేసుకోలేని, నిస్సహాయ స్థితిలో ఉన్న సుమారు 40 మంది వృద్ధుల ఇళ్లకు స్వయంగా పంపిస్తున్నారు. నిజమైన అవసరంలో ఉన్నవారిని గుర్తించి, ఎలాంటి సిఫార్సులకు తావులేకుండా అర్హులైన వారికే భోజనం అందించడం ఈ సేవలో ప్రత్యేకతగా నిలుస్తోంది. ఉదయం వంట ప్రక్రియ ఒక యజ్ఞంలా సాగితే.. వంట పూర్తయ్యాక ఆహారాన్ని క్యారేజీల్లో సర్ది అన్నార్తుల ఇళ్లకు చేర్చడం మహాయజ్ఞంతో సమానమని రవికుమార్ పేర్కొన్నారు. "వయసు మీదపడి వంట చేసుకోలేని నిరాశ్రయ వృద్ధుల ఆకలి తీర్చడమే నా లక్ష్యం. డబ్బు సంపాదించడం కంటే ఒక పేదవాడి ఆకలి తీర్చడంలోనే నిజమైన తృప్తి ఉంది. అమ్మానాన్నల పేరు శాశ్వతంగా నిలవాలనే సంకల్పంతో, వారి ఆశీస్సులతో ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాను" అని ఆయన తెలిపారు. దాతలకు అవకాశం రవికుమార్ నిర్వహిస్తున్న ఈ సేవాయజ్ఞంలో దాతలు కూడా భాగస్వాములు కావచ్చని ఆయన తెలిపారు. ఎవరి పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం వంటి ప్రత్యేక రోజునైనా అన్నదానానికి దాతగా ముందుకు వస్తే.. ఆ రోజును వారికి కేటాయించి వృద్ధులకు భోజనం అందించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. నిస్వార్థంగా కొనసాగిస్తున్న ఈ సేవ పట్ల గ్రామస్థులు, పెద్దలు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, వృద్ధుల ఆకలి తీర్చేందుకు ముందుకు రావడం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు అభినందిస్తున్నారు.

## జోగి రాజీవ్ లైంగిక పటుత్వ పరీక్షపై కౌంటర్ దాఖలు

**విజయవాడ లీగల్,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** మాజీమంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్‌కు లైంగిక పటుత్వ పరీక్ష నిర్వహించాలని దాఖలైన పిటీషన్‌పై ఆయన తరపు న్యాయవాది చోడిశెట్టి మన్మధరావు, నిర్మలత, సాయిఈశరణ్‌లు న్యాయస్థానంలో కౌంటర్ దాఖలు చేశారు. తదుపరి విచారణను ఈనెల 18వ తేదీకి 4వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి వాయిదా వేశారు.

## ప్రశ్న రావణ్ కేసు

**మచిలీపట్నం/విజయవాడ లీగల్, సెప్టెంబర్ 11:** ప్రశ్న రావణ్ అలియాస్ బచ్చలకూరి జోసఫ్ బెయిల్ కేసును మచిలీపట్నం ప్రిన్సిపల్ డిస్ట్రిక్టు కోర్టు నుండి విజయవాడ 4వ అదనపు జిల్లా న్యాయస్థానానికి బెయిల్ పిటీషన్ బదిలీ చేశారు. ఈ కేసులో నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న ప్రశ్న రావణ్ అలియాస్ బచ్చలకూరి జోసఫ్‌కు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షులు, న్యాయవాది ఒగ్గు గవాస్కర్ పిటీషన్ దాఖలు చేసిన విషయం విదితమే. బెయిల్ పిటీషన్‌పై పబ్లిక్ ప్రాసిక్యూటర్ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ న్యాయమూర్తి ఈనెల 19వ తేదీకి వాయిదా వేశారు.

## గోరంట్ల మాధవ్ కేసు విచారణ వాయిదా

**విజయవాడ లీగల్,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** పోక్సో కేసులో బాధితురాలి వివరాలను బహిర్గతం చేశారనే ఆరోపణలపై మాజీ యంపి గోరంట్ల మాధవ్‌పై సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైన విషయం విదితమే. ఈ కేసులో గోరంట్ల మాధవ్ హాజరుకాలేకపోవడంతో శుక్రవారం ఆయన తరపు న్యాయవాది, వైఎస్ఆర్‌సిపి లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒగ్గు గవాస్కర్, వెంకట ప్రతాప్ కుమార్‌లు హాజరై, గైర్హాజరు పిటీషన్ దాఖలు చేశారు. దీంతో పోక్సో కోర్టు న్యాయమూర్తి విచారణను వచ్చే నెల 09వ తేదీకి వాయిదా వేశారు.

## గాదె సాయికృష్ణ కేసులో విజయలక్ష్మి కోర్టుకు హాజరు

**విజయవాడ లీగల్,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కృష్ణలంకకు చెందిన కాపు యువకుడు గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో ఆయన తల్లి విజయలక్ష్మి రక్త నమూనాలు సేకరించేందుకు అనుమతివ్వాలని కోరుతూ సిట్ అధికారులు న్యాయస్థానంలో పిటీషన్ దాఖలు చేశారు. దీనికి సంబంధించి శుక్రవారం ఆమె 2వ అదనపు జ్యుడీషియల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరయ్యారు. ఆమె రక్త నమూనాలు సేకరించేందుకు సమ్మతమేనా అని న్యాయమూర్తి అడుగగా, అందుకు ఆమె అంగీకారం తెలుపుతూ, కాగితముపై వ్రాతపూర్వకంగా అంగీకరిస్తూ, సంతకము చేశారు. తదుపరి విచారణ న్యాయమూర్తి వాయిదా వేశారు.

## మద్యం రవాణా కేసులో రిమాండ్ పొడిగింపు

**విజయవాడ లీగల్,సెప్టెంబర్ 11 (వార్తాప్రభ) :** ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరేట్ నమోదుచేసిన అక్రమ మద్యం రవాణా కేసులో చంచల్‌గూడ జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో వున్న కారుమూరి సునీల్‌కుమార్ రిమాండ్ శుక్రవారం ముగియడంతో పోలీసులు వర్చువల్‌గా విజయవాడలోని ఎసిబి న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఎల్.తేజోవతి ఈనెల 25వ తేదీ వరకు రిమాండ్ పొడిగిస్తూ ఆదేశాలు జారీచేశారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188